ప్రజాశక్తి

బుధవారం 9 ఆగస్టు 2023 8 పేజీలు



గుంటూరు



పల్నాడు

నేటి నుంచి సమ్మెలోకి విద్యుత్ ఉద్యోగులు

నిలిచిన విద్యుత్ సరఫరా - మరమ్మతులకు గైర్హాజరు 2 లో

హామీలు అమలు చేయకుంటే సిఎం ఇంటి ముట్టడి

కలెక్టరేట్ల వద్ద రెండ్రోజుల ధర్నాలో విఆర్ఎల సంఘం రాష్ట్ర కార్యదర్శి ఎం.బాలకాశి 4, 5 లో

టిడిపి హయాంలోనే గురజాల అభివృద్ధి

- రూ.వేల కోట్లు దోచుకున్న 'క్యాష్' మహేష్‌రెడ్డి
- పిడుగురాళ్ల సభలో నారా లోకేష్ విమర్శలు
- నేడు రాజుపాలెం మండలంలో యువగళం పాదయాత్ర

4 లో









పంచాయతీ ఉప ఎన్నికలకు నామినేషన్లు స్వీకరణ

ప్రజాశక్తి - ప్రత్తిపాడు

వార్డు పదవులకు నామినేషన్ ప్రక్రియ మంగళవారం మొదలైంది. ఐదు గ్రామల్లో ఐదు వార్డులకు ఎన్నికలు జరగాల్సి ఉండగా వాటిని రెండు క్లస్టర్లుగా ఏర్పాటు చేసి నామినేషన్లు స్వీకరిస్తున్నారు. మేడవారిపాలెం 2వ వార్డు జనరల్, పాతమల్లాయపాలెం 10వ వార్డు ఎస్సీ జనరల్, నడింపాలెం 10వ వార్డు బీసీ మహిళ, నిమ్మగడ్డవారిపాలెం 4వ వార్డు జనరల్, గొట్టిపాడు 2వ వార్డు జనరల్‌కు ఎన్నికలు నిర్వహించాల్సి ఉండగా ఇద్దరు మండల స్థాయి అధికారులను స్టేజ్-1 ఎన్నికల అధికారులకు నియమించారు. ఇదిలా ఉండగా గొట్టిపాడు గ్రామ రెండో వార్డు సభ్యునిగా నామినేషన్ దాఖలు చేసేందుకు టిడిపి మద్దతుదారు నిమ్మగడ్డ శ్రీకాంత్ మధ్యాహ్నం 12 గంటలకు రాగా వారికి ఇచ్చిన ఫారాలను పూర్తి చేసేలోపే 12.45 గంటలకు స్టేజ్-1 ఎన్నికల అధికారులు భోజనానికి వెళ్లారు. దీంతో అభ్యర్థి ముప్పావు గంటపాటు నిరీక్షించారు.

తాడేపల్లిలో భద్రతకు ఢోకాలేదు : సిఐ

ప్రజాశక్తి-తాడేపల్లి

సిఎం నివాసం ఉంటున్న తాడేపల్లి ప్రాంతంలో శాంతిభద్రతలకు ఢోకా లేదని తాడేపల్లి సిఐ శేషగిరిరావు తెలిపారు. మంగళవారం ఆయన స్థానిక పోలీస్‌స్టేషన్‌లో విలేకరులతో మాట్లాడారు. నిత్యం ఈ ప్రాంతంలో కార్డన్ సెర్చ్ నిర్వహిస్తున్నామని, బ్లేడ్‌బ్యాచ్, గంజాయి ముఠా కదలికలను ఎప్పటికప్పుడు నియంత్రిస్తున్నామని అన్నారు. సమస్యాత్మక ప్రాంతాలు, నిర్మానుష్య ప్రదేశాల్లో నింతరం పోలీస్ గస్తీ ఏర్పాటు చేశామన్నారు. విజయవాడ క్లబ్ దాటిన తరువాత సుందరయ్య నగర్ కట్టపై రెండ్రోజుల క్రితం జరిగిన ఘటనకు సంబంధించి బాధితులు తెలిపిన సమాచారంతో గంటల వ్యవధిలోనే ఇద్దర్ని అదుపులోకి తీసుకున్నామని, వారి వద్ద మారణాయుధాలేమీ లేవని చెప్పారు. ద్విచక్ర వాహనంపై వెళ్తున్న వ్యక్తిని అడ్డగించి సెల్‌ఫోన్, కొంత నగదు లాక్కొని పారిపోయినట్లు తమ విచారణలో తేలిందన్నారు. తాడేపల్లి పోలీస్‌స్టేషన్ ప్రాంతంలో శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించారు.



సమావేశంలో మాట్లాడుతున్న పి.దీప్తిమనోజ

16-19 తేదీల్లో జిల్లాలో అంగన్వాడీల పోరుయాత్రను జయప్రదం చేయండి

ప్రజాశక్తి - పెదకాకాని

అంగన్వాడీల సమస్యల పరిష్కారం కోసం ఆగస్టు 16 నుండి 19 వరకు గుంటూరు జిల్లాలోని అన్ని మండల కేంద్రాలను కలుపుతూ జరిగే పోరు యాత్రను జయప్రదం చేయాలని ఏపీ అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి పి.దీప్తి మనోజ పిలుపునిచ్చారు. పెదకాకాని సుందరయ్య నగర్ లోని సిఐటియు కార్యాలయంలో పి.కనకవల్లి అధ్యక్షతన జరిగిన పెదకాకాని మండల అంగన్వాడీల సమావేశంలో సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి వై.నేతాజీ మాట్లాడుతూ అంగన్వాడీల ప్రతి సెంటర్ లోనూ ఏదో ఒక సమస్య తిష్టవేసి ఉందని, అధికారులు సమస్యలు పరిష్కారం చేయకుండా పని పూర్తి కావాలని వేధింపులకు పాల్పడుతున్నారని అన్నారు. అనంతరం నాయకులు ఎన్.శివాజీ మాట్లాడారు. ఈ సందర్భంగా యూనియన్ మండల కమిటీ ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా షబానా, ప్రధాన కార్యదర్శిగా పి.కనకవల్లి, కోశాధికారిగా లక్ష్మి, ఉపాధ్యక్షులుగా సహజ, తిరుమల, పావని, నీరజ, ధనశ్రీ, ప్రభావతి, మంగమ్మ ఎన్నికయ్యారు.

నేటి నుంచి సమ్మెలోకి విద్యుత్ ఉద్యోగులు

నిలిచిన విద్యుత్ సరఫరా - మరమ్మతులకు గైర్హాజరు

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

విద్యుత్ ఉద్యోగుల సమ్మె ప్రభావం ముందస్తుగానే కన్పిస్తుంది. బుధవారం అర్ధరాత్రి నుంచి విద్యుత్ ఉద్యోగులు సమ్మె చేయనున్నారు. ఈ నేపథ్యంలో మంగళవారం రాత్రి నుంచి ఉద్యోగులు ఎక్కడికక్కడ విధులకు దూరంగా ఉన్నారు. పల్నాడు జిల్లాలో అమరావతి మండలంలో రాత్రి 8 గంటల నుంచి విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. దుగ్గిరాల, పెదనందిపాడు, కాకుమాను తదితర ప్రాంతాల్లో సరఫరా నిలిచిపోయింది. కొన్ని ప్రాంతాల్లో వోల్టేజి సమస్య వచ్చింది. అయితే ప్రజలనుంచి విద్యుత్ కార్యాలయాలకు భారీగా ఫోన్ కాల్స్ వస్తున్నా ఎవ్వరూ స్పందించడంలేదు. కలెక్టర్లకు, ప్రభుత్వానికి చెప్పుకోమని విద్యుత్ ఉద్యోగులు బదులు ఇస్తున్నారు. బుధవారం



సాయంత్రం 5 గంటల నుంచి ఉద్యోగులు వర్క్‌టూరూల్ పాటిస్తున్నారు. ప్రజలనుంచి వచ్చే ఫిర్యాదులకు హాజరుకాకూడదని నిర్ణయించుకున్నారు. దీంతో సాంకేతిక కారణాలతో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడితే పరిష్కరించే పరిస్థితి లేదంటున్నారు. చాలా ప్రాంతాల్లో రాత్రి 8 గంటల నుంచి విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతున్నట్టు సమాచారం.

ఆదాయం ఉన్నా సిబ్బంది లేక సతమతం

ప్రజాశక్తి-దుగ్గిరాల

స్థానిక వ్యవసాయ మార్కెటింగ్ యార్డు అభివృద్ధి చెందుతున్నా నిర్వహణకు తగినంత సిబ్బంది లేక సతమతమవుతున్నారు. అకస్మాత్తుగా పసుపు ధరలు పెరగడంతో యార్డుకు మార్కెట్ ఫీజు రూపంలో రూ.1.07 కోట్ల ఆదాయం వచ్చింది. ఇది గత సంవత్సరం నాలుగు నెలల ఆదాయం కంటే సంవత్సరం నాలుగు నెలల కాలంలో రూ.22 లక్షలు అధికం. అయితే సిబ్బంది కొరత యార్డును వేధిస్తోంది. 42 మంది ప్రభుత్వ సిబ్బంది ఉండాల్సి ఉన్నా నలుగురే విధులు నిర్వహిస్తున్నారు. ఉద్యోగ విరమణ చేసిన వారిస్థానంలో కొత్తవారిని నియమించడం లేదు. మరో 20 మంది ఔట్సోర్సింగ్ ఉద్యోగులు యార్డు పరిధిలోని నాలుగు చెక్‌పోస్టుల్లో విధులు నిర్వహించడంతోపాటు యార్డులో నైట్ డ్యూటీలు, రెగ్యులేషన్ వీరే చేయాల్సి



వస్తోంది. ప్రస్తుతం యార్డులో ప్రతిరోజు 1500-2000 క్వింటాళ్ల పసుపు విక్రయాలు జరుగుతున్నాయి. పసుపు ధరలు ఇంకా పెరిగితే విక్రయాలు మరింత పెరిగే అవకాశాలున్నాయి. ఈ నేపథ్యంలో యార్డు నిర్వహణకు తగినంత సిబ్బందిని నియమించాలనే డిమాండ్ వ్యక్తమవుతోంది.

ప్రాతూరులో చిరు వ్యాపారులకు, వృత్తిదారులకు టిడిపి చేయూత

ప్రజాశక్తి-తాడేపల్లి రూరల్



ప్రాతూరుకు చెందిన ఆరుగురు చిరు వ్యాపారులకు బడ్డీ కోట్లు, వృత్తిదారులకు ఒక సెలూన్ చైర్, ట్రై సైకిల్‌ను మంగళవారం టిడిపి కార్యదర్శి నారా లోకేష్, తెలుగుదేశం ప్రాతూరు గ్రామ అధ్యక్షులు అరవపల్లి శ్రీనివాసరావు సంయుక్త సహకారంతో లబ్ధిదారులకు అందజేశారు. లబ్ధి పొందిన వృత్తిదారులు నారా లోకేష్, అరవపల్లి శ్రీనివాసరావుకు ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో టిడిపి తాడేపల్లి మండల అధ్యక్షులు అమర సుబ్బారావు, ప్రధాన కార్యదర్శి కొల్లి శేషు, ప్రాతురు రాజేష్, చొక్కా ఫ్రాన్సిస్ పాల్గొన్నారు.



వెంకట సుబ్బయ్యకు లయన్స్ అవార్డు

ప్రజాశక్తి-గుంటూరు : లయన్స్‌క్లబ్ 2021- 22, 2022-23 సంవత్సరాల్లో లయన్స్ క్లబ్బుల ద్వారా విశేష సేవలు అందించినందుకు గాను ప్రతిష్టాత్మక జిల్లా గవర్నర్ అప్రిసియేషన్ అవార్డు, గవర్నర్ ఎక్సలెన్సీ అవార్డులను లయన్స్ క్లబ్ ఆఫ్ పట్టాభిపురం సీనియర్ నాయకులు లయన్ వి.వెంకట సుబ్బయ్య కైవసం చేసుకున్నారు. లయన్స్ క్లబ్స్ జిల్లా 316 హెచ్ సంవత్సరాంత అవార్డుల ప్రదానోత్సవం స్థానిక అమరావతి రోడ్డు బివిఆర్ సమావేశ మందిరంలో హైకోర్టు న్యాయమూర్తి డాక్టర్ జస్టిస్ కె.మన్మధరావు, ఇంటర్నేషనల్ డైరెక్టర్ పి సుభాష్‌బాబు, ఏరియా లీడర్ డాక్టర్ విఎస్‌విడి శివప్రసాద్ నుండి అవార్డులను వెంకటసుబ్బయ్య అందుకు న్నారు. కార్యక్రమంలో జిల్లా మాజీ గవర్నర్ కె.విజయచంద్, మాజీ ఇన్‌ఛార్జులు గవర్నర్ పి.గోపీచంద్ పాల్గొన్నారు.



బస్సు పాస్‌లు వితరణ

ప్రజాశక్తి-తాడేపల్లి : సీకో బయోటిక్స్ అధినేత శీలం కోటిరెడ్డి సంస్మరణార్థం ఆయన కుమారుడు శీలం జయరామిరెడ్డి తాడేపల్లి జిల్లా పరిషత్ హైస్కూల్ విద్యార్థినీ విద్యార్థులకు ఆర్‌టిసి బస్ పాస్‌ల లామినేషన్ నిమిత్తం రూ.30 వేలు ఆర్థిక సాయం అందజేశారు. మంగళవారం పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు, ఆర్‌టిసి అధికారుల సమక్షంలో 500 మంది విద్యార్థులకు ఈ ప్రక్రియను పూర్తి చేసి అందించారు. ప్రభుత్వ గుర్తింపు ఉన్న పాఠశాలలకు కూడా బస్‌పాస్‌లు అందజేస్తున్నారు. కార్యక్రమంలో శీలం జయరామిరెడ్డి, హెచ్‌ఎం భీమిరెడ్డి తాతిరెడ్డి, మాజీ స్కూల్ కమిటీ చైర్మన్ సిహెచ్.భిక్షాలరావు, ఆర్‌టిసి నుంచి శ్రీధర్, వి.శ్రీనివాస రావు, జివి సుబ్రహ్మణ్యం, బి.సాంబశివరావు పాల్గొన్నారు.

ఏకాదశి నాటికి కోనేరు కొన్ని పూర్తి చేయాలి

ప్రజాశక్తి- మంగళగిరి : పట్టణంలోని పెద్ద కోనేరులో జరుగుతున్న పనులను ఈ ఏడాది ముక్కోటి ఏకాదశి నాటికి పూర్తి చేయాలని ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి అన్నారు. మంగళవారం దేవస్థానం ఈవో కార్యాలయంలో దేవాలయ శాఖ విభాగపు ఇంజనీరింగ్ అధికారులతో ఎమ్మెల్యే సమావేశమయ్యారు. నిర్మాణ పనులను వెంటనే పూర్తి చేసి సందర్శనకు వీలు కల్పించాలన్నారు. సమావేశంలో ఆలయ ఈవో ఎ.రామకోటిరెడ్డి, ఇంజినీరింగ్ అధికారులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలను వినియోగించుకోవాలి

ప్రజాశక్తి - గుంటూరు

చిరు వ్యాపారులకు మెరుగైన జీవనోపాధి కల్పించటానికి కేంద్ర ప్రభుత్వం పిఎం స్వానిధి పథకం ద్వారా రాష్ట్ర ప్రభుత్వం జగనన్న తోడు ద్వారా పెట్టుబడికి ఆర్థిక సహాయం అందిస్తున్నాయని కలెక్టర్ ఎం.వేణుగోపాల్‌రెడ్డి తెలిపారు. మంగళవారం కలెక్టరేట్‌లో పీఎం స్వానిధి పథకంపై ఎస్ఎల్‌బీసీ, మెప్మా ఆధ్వర్యంలో చిరువ్యాపారులకు నిర్వహించిన అవగాహన సదస్సులో ఎమ్మెల్యే మద్దాళి గిరిధర్‌రావుతో కలసి కలెక్టర్ పాల్గొని మాట్లాడారు. వీధి వ్యాపారులకు వడ్డీపై ఏడు శాతం రాయితీ ఇచ్చి కేంద్ర ప్రభుత్వం పీఎం స్వానిధి పథకం ద్వారా మొదటి విడత పెట్టుబడికి రూ.10 వేలు, రాష్ట్ర ప్రభుత్వం పూర్తి వడ్డీ రాయితీతో జగనన్న తోడు పథకం ద్వారా రూ.10 వేలు బ్యాంకు ద్వారా రుణం అందిస్తుందన్నారు. పీఎం స్వానిధి ద్వారా మొదటి విడతలో అందించిన రుణం సకాలంలో చెల్లిస్తే రెండో విడతలో రూ.15 వేలు నుంచి రూ.20 వేలు వరకు, మూడో విడతలో రూ.30 వేలు నుండి రూ.50 వేల వరకూ వడ్డీ రాయితీతో రుణం వస్తుందన్నారు. కార్యక్రమంలో లీడ్ బ్యాంక్ మేనేజర్ మహిళాపాల్‌రెడ్డి, మెప్మా పీడీ వెంకటనారాయణ ప్రసంగించారు. అనంతరం జిల్లాలో ఎక్కువ రుణాలు మంజూరు చేసిన బ్యాంకర్లకు, రుణాల మంజూరుకు సహకారం అందించిన మెప్మా ఉద్యోగులకు కలెక్టర్, ఎమ్మెల్యే, ఇతర అధికారులు ప్రశంసాపత్రాలు అందచేశారు. కార్యక్రమంలో నగర డిప్యూటీ మేయరు సజీలా తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ భవన నిర్మాణాలు వేగవంతం చేయాలి

ప్రభుత్వ ప్రాధాన్యత భవనాల నిర్మాణాలు సెప్టెంబర్ 15వ తేదీ నాటికి పూర్తి చేసి, సంబంధిత శాఖలకు అప్పగించాలని పంచాయతీ రాజ్ ఇంజనీర్లను జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్‌రెడ్డి ఆదేశించారు. గ్రామ సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలు, వైఎస్ఆర్ హెల్త్ క్లినిక్‌లు, గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం క్రింద మంజూరు చేసిన పనుల పురోగతిపై మండలాల వారీగా కలెక్టరేట్‌లో కలెక్టర్ మంగళవారం సమీక్షించారు. గ్రామ



ప్రశంసాపత్రాలు అందచేస్తున్న కలెక్టర్, తదితరులు

సచివాలయాలు 204 లక్ష్యం కాగా, ఇంతవరకు 88 పూర్తి చేసి అప్పగించామని, 34 రైతు భరోసా కేంద్రాలకుగాను వాటిని పూర్తి చేసి అప్పగించామని, వైఎస్ఆర్ హెల్త్ క్లినిక్‌లు 28కిగాను 17 పూర్తి చేసి అప్పగించామని కలెక్టర్‌కు పంచాయతీరాజ్ ఎస్‌ఇ జి.బ్రహ్మయ్య వివరించారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం కింద మంజూరైన 243 పనుల్లో 82 పూర్తి అయ్యాయని చెప్పారు. కలెక్టర్ మాట్లాడుతూ లక్ష్యం మేరకు మిగిలిన భవనాల నిర్మాణ పనులను పూర్తి చేయాలని, నిర్మాణ పనుల పురోగతికి సంబంధించి దశలవారీగా బిల్లులను ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేసి చెల్లింపులకు చర్యలు తీసుకోవాలని చెప్పారు. సమీక్షలో పంచాయతీ రాజ్ శాఖ ఇఇ ముత్యంబాబు, డిఇఇలు, ఎఇఇలు పాల్గొన్నారు.

గోదావరిలో తల్లీ చెల్లెలు గల్లంతు - ఒంటరైన బాలిక

- బాలికను తెనాలిలోని పెద్దమ్మ ఇంటికి చేర్చిన పోలీసులు
- తల్లితో సహజీవనం చేస్తున్న వ్యక్తే నదిలో నెట్టేశాడని వాపోయిన బాలిక

ప్రజాశక్తి-తెనాలి


వివరాలు వెల్లడిస్తున్న బాలిక కీర్తన

సహజీవనం చేస్తున్న మహిళను, ఆమె ఇద్దరు కుమార్తెలను వదిలించుకోవాలన్న దురాలోచనతో నదిలోకి నెట్టి దుండగుడు పారిపోగా, అత్యంత ధైర్య సాహసాలు ప్రదర్శించి 13 ఏళ్ల బాలిక బయటపడింది. తల్లి చెల్లి నదిలో కొట్టుకుపోయారు. బాలిక అనాథ కావడంతో స్థానిక చెంచుపేటలోని ఆమె పెద్దమ్మ వద్దకు పోలీసులు చేర్చారు. వివరాలను పరిశీలిస్తే తాడేపల్లి క చెందిన ముప్పాళ్ళ సరోజిని కొంతకాలం క్రితం భర్తతో విభేదించింది కుమార్తె కీర్తనతో ఉంటుంది. ఈ క్రమంలో ప్రకాశం జిల్లాకి చెందిన సురేష్ తో ఆమెకు పరిచయమైంది. అది కాస్త సహజీవనానికి దారి తీయడంతో వారికి ఏడాది క్రితం మరో కుమార్తె జన్మించింది. ఇటీవల సురేష్, సుహాసిని మధ్య కూడా వివాదాలు తారాస్థాయి చేరడంతో ఎలాగైనా వారిని వదిలించుకోవాలని సురేష్ కుట్ర పన్నాడు. దానిలో భాగంగా ఈనెల ఆరున షాపింగ్ చేద్దామంటూ కారులో రాజమండ్రి తీసుకువెళ్లాడు. పగలంతా పట్టణంలో కాలక్షేపం చేసిన వారు, పొద్దు పోయాక కూడా కారులో షికారు చేశారు. దాదాపు అర్ధరాత్రి దాటిన తర్వాత రావులపాలెం పాత వంతెన వద్దకు వెళ్లారు. అక్కడ సెల్ఫీ దిగుదామంటూ వారిని కారులో నుంచి దించిన సురేష్ బలవంతంగా సుహాసినిని, జెర్సీని నదిలో నెట్టేశాడు. పారిపోతున్న 13 ఏళ్ల కీర్తనను కూడా పట్టుకుని నదిలో విసిరేశాడు. అయితే అదష్టవశాత్తు కీర్తనకు ఓ పైపు చేతికందడంతో దాన్ని పట్టుకొని వేలాడుతూనే, ఆమె వద్ద గల సెల్ఫోన్తో 100కు సమాచారం ఇచ్చింది. వెంటనే స్పందించిన పోలీసులు బాలిక వద్దకు చేరుకొని ఆమెను రక్షించారు. అయితే బాలిక పోలీసులకు సమాచారం ఇవ్వడం పట్ల అంతా విస్మయమందారు. తల్లి చెల్లి నదిలో గల్లంతు కాగా బాలిక ఒంటరి అయిన నేపథ్యంలో తెనాలి చెంచుపేటలో ఉంటున్న ఆమె పెద్దమ్మ సునీత వద్దకు బాలికను చేర్చారు.

ఈ సందర్భంగా బాలిక ఘటన జరిగిన వైనాన్ని పూర్తిగా వివరించి, కన్నీరు మున్నీరయింది. బాలిక పెద్దమ్మ సుజాత కూడా కొంతకాలంగా వారి మధ్య స్పర్ధలు ఉన్నట్లు వెల్లడించింది.

రేషన్ బియ్యాన్ని తరలిస్తున్న వ్యక్తులు అరెస్ట్

ప్రజాశక్తి-అమరావతి



అమరావతి మండల పరిధిలోని మంత్రాయపాలెం గ్రామం నుంచి కోళ్ల ఫారాలకు అక్రమంగా రేషన్ తరలిస్తున్న వ్యక్తులను అమరావతి పోలీసులు పట్టుకున్నారు వారిపై 420 కేసు నమోదు చేసి పట్టుకున్న ఐదు క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని, ఆటోను సీజ్ చేశారు. ముద్దాయి మల్లెల కోటేశ్వరరావు తన్నీరు వెంకటేశ్వరావు లపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై మహబూబ్ సుభాని తెలిపారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అనధికారికంగా అక్రమ రేషన్ తరలిస్తున్న వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఆయన అన్నారు పేదలకు అందవలసిన బియ్యాన్ని అక్రమార్గంలో అమ్ముకుంటున్న వారిపై ప్రత్యేక చర్యలు తీసుకుంటామన్నారు.

విజిలెన్స్ తనిఖీలు - భారీ జరిమానాలు

ప్రజాశక్తి-దుగ్గిరాల


విజిలెన్స్ దాడిలో పాల్గొన్న అధికారుల బృందం

విజిలెన్స్ సిబ్బందితో కలిసి ట్రాన్స్కో సిబ్బంది మంగళ వారం మండలంలో జరిపిన తనిఖీల్లో భారీ జరిమానాలు విధించారు. తెనాలి రూరల్ కొల్లిపర దుగ్గిరాల ట్రాన్స్కో సిబ్బంది ,విజిలెన్స్ సిబ్బంది 63 బందాలుగా ఏర్పడి మండల వ్యాప్తంగా 5008 సర్వీసులు తనిఖీ చేశారు 1504 గహాలకు సంబంధించి అదనపు లోడు ఉన్నట్టుగా గుర్తించి 5,68,800 రూపాయలు జరిమానా విధించారు 42 వాణిజ్య సర్వీసులు గుర్తించి 1 ,08 ,800 మొత్తం 6,71, 600 రూపాయలు జరిమానా విధించారు. గుంటూరు నుండి వచ్చిన అదనపు సిబ్బందితోపాటు విజిలెన్స్ ఈ ఈ మూర్తి, ట్రాన్స్కో ఈ ఈ వివి చిరంజీవి డిప్యూటీ మల్లికార్జునరావు దుగ్గిరాల సత్యనారాయణ పాల్గొన్నారు.

ఎస్ఆర్కెటి కాలనీలో కార్డెన్ సెర్చ్

ప్రజాశక్తి - పల్నాడు జిల్లా

పల్నాడు జిల్లా ఎస్.పి రవి శంకర్ రెడ్డి ఆదేశాల మేరకు నరసరావుపేట డి.ఎస్.పి కె.వి మహేష్ ఆధ్వర్యంలో మంగళవారం కేశనపల్లి పంచాయతి పరిధిలోని ఎస్ఆర్కెటి ప్రాంతంలో కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఒకటవ, రెండవ గ్రామీణ సిఐలు,ఎస్ఐ సిబ్బంది పాల్గొ న్నారు. అనుమానాస్పద, సరైన పత్రాలు లేని ద్వి చక్ర వాహ నాలను అదుపులోకి తీసుకున్నారు.



కాలనీలో ఉన్న రౌడీ షీటర్లకు, నేర ప్రవృత్తి ఉన్న కొందరు యువకులకు డిఎస్పి మహేష్ ప్రత్యేక కౌన్సిలింగ్ చేశారు. ఈ సందర్భంగా డిఎస్పి మాట్లాడుతూ కొంత మంది వల్ల మాత్రమే ఈ ప్రాంతానికి చెడ్డ పేరు వస్తోందని అన్నారు. మద్యం సేవించి జీవితాన్ని, కుటుంబాలను చిన్నా భిన్నం చేసుకోవ ద్దని, రానున్న కాలంలో ఈ ప్రాంతం విద్యా,ఉద్యోగాలు పొంద డంలో ముందు ఉండేలా చూసుకోవాలని చెప్పారు. అదే ప్రాంతంలో ఉన్నత చదువులు చదువుతున్న యువ కులను అయన అభినందించారు. గంజాయి, మట్కా లాంటి కదలికలు ఏమైనా ఉంటే నేరుగా తనకు కానీ సిబ్బందికి కానీ ఫోన్ చేయాలని, నేర చరిత్ర ఉన్న వారు లేదా కొత్త వ్యక్తులకు ఇళ్లు అద్దెలకు ఇవ్వవద్దని గృహ యాజమానులకు సూచించారు. ఒకటవ పట్టణ సిఐ అశోక్ కుమార్, గ్రామీణ సిఐ భక్తవత్సలరెడ్డి లు మాట్లాడుతూ కొందరు యువకుల కదలికల వల్లే ఒక్క ఎస్ఆర్కెటి ప్రాంతంలోనే ఏడాదికి రెండు సార్లు కార్డెన్ సెర్చ్ చేయడానికి కారణమని అన్నారు. ద్విచక్ర వాహనం నడిపే ప్రతి ఒక్కరూ డ్రైవింగ్ లైసెన్స్, వాహన ధ్రువీకరణ పత్రాలు తప్పనిసరిగా కలిగి ఉండాలని, రౌడీమూకల కదలికలపై పోలీసులకు సమాచారం ఇవ్వాలని, ఇచ్చిన వారి పేరు గోప్యంగా ఉంచుతామని చెప్పారు.



మిర్చి నిల్వలు

	బ్యాగులు
మిర్చి దిగుమతి	: 35,468
మిర్చి ఎగుమతి	: 36,699
మిర్చి నిల్వ	: 9,799

మిర్చి ధరలు

	రూపాయలలో
334	9,500 - 23,200
నెం.5	11,000 -19,000
341	10,000 - 22,000
సూపర్10	15,000 - 19,000
	నాన్ ఎసి
తేజ	9,000 - 23,700
బడిగి	9,200 - 26,500
దేవనూరు డీలక్స్	14,500 - 21,500
తాలుకాయలు	5,000 -14,500
	ఎసి
334	15,000 - 24,000
నెం.5	15,500 -15,000
273	18,000 - 21,000
341	10,000 - 22,000
సూపర్10	19,700 - 19,700
తేజ	15,500 - 23,000
బడిగి	14,000 - 26,000
దేవనూరు డీలక్స్	18,000 - 22,500
తాలుకాయలు	5,000 -13,000

కళ్లల్లో కారం కొట్టి మెడలో గొలుసు చోరీ

ప్రజాశక్తి - మంగళగిరి రూరల్: కళ్లల్లో కారం కొట్టి ఓ మహిళ మెడలో బంగారు నానుతాడు లాక్కెళ్ళిన సంఘటన మంగళగిరి -తాడేపల్లి కార్పోరేషన్ పరిధి నవులూరులో మంగళవారం చోటుచేసుకుంది. రూరల్ పోలీసులు తెలిపిన వివరాల మేరకు... నవులూరు చెందిన చల్లా లక్ష్మీనరసింహమూర్తి, శ్రీదేవి భార్యాభర్తలు. లక్ష్మీ నరసింహమూర్తి పురోహితం చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటుండగా శ్రీదేవి గహిణి. వీరికి రెండు పోర్షన్ల ఇల్లు ఉండగా ఓ పోర్షన్ అద్దెకు ఇచ్చే ఉద్దేశంతో బయట గేటుకు ఇటీవల టూలెట్ బోర్డు పెట్టారు. మంగళవారం ఓ గుర్తు తెలియని వ్యక్తి తన ద్విచక్ర వాహనాన్ని ఆపి లోపలకి వెళ్లాడు. దీంతో ఒంటరిగా ఉన్న శ్రీదేవి ఎవరు మీరు అంటూ ప్రశ్నించడంతో ఇల్లు అద్దెకు కావాలని అడిగాడు. ఇల్లు అద్దెకు ఇస్తామని, అయితే ఇలా నేరుగా ఇంట్లోకి రావడం ఏమని ప్రశ్నించి ఆగ్రహ వ్యక్తం చేసింది. దీంతో గుర్తు తెలియని దుండగుడు తన వెంట తెచ్చుకున్న కారాన్ని శ్రీదేవి కళ్ళల్లో కొట్టి ఆమె మెడలో ఉన్న సుమారు రూ. లక్ష విలువైన 24 గ్రాముల బంగారు నానుతాడును లాక్కోవడంతో ఆమె కేకలు వేయగా అప్పటికే దుండగుడు ద్విచక్ర వాహనంపై పారిపోయాడు. శ్రీదేవి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

చోరీ కేసులో నిందితులకు రిమాండ్

ప్రజాశక్తి-దుగ్గిరాల: మండలంలోని చిలువూరు గ్రామంలో ఈ నెల మూడో తేదీ రాత్రి వద్ద మహిళ నోటిలో గుడ్డకుక్కి దొంగతనానికి పాటుపడిన కేసులో ఇద్దరు నిందితులను సోమవారం సాయంత్రం తుమ్మపూడి గ్రామ సమీపంలో దుగ్గిరాల పోలీసులు అరెస్టు చేశారు,. మూడో వ్యక్తి పరారీలో ఉన్నాడు అరెస్టు చేసిన ఇద్దరిని కోర్టుకు హాజరుపరచగా మెజిస్ట్రేట్ 14 రోజులు రిమాండ్ విధించారు. దొంగతనానికి పాల్పడిన వారిలో ఒకరు చిలువూరు గ్రామానికి చెందిన బద్దల చంద్రశేఖర్ కాగా మరొకరు రంగారెడ్డి జిల్లా తారా నగర్ గ్రామానికి చెందిన చంద్రశేఖర్ బంధువు బొమ్మినేని సాయికుమార్,. దుగ్గిరాల ఎస్సై ఏ శ్రీనివాస్ రెడ్డి తన సిబ్బందితో కలిసి నిందితులను అరెస్టు చేశారు.

వైసిపి నుండి టిడిపిలోకి చేరికలు



ప్రజాశక్తి-సత్తెనపల్లి రూరల్: రాజుపాలెం మండలం రెడ్డిగూడెం కు చెందిన 8 మంది వైసీపీ కార్యకర్తలు టిడిపి లో చేరారు.రెడ్డిగూడెం గ్రామానికి చెందిన టిడిపి నేతలు నిమ్మకాయల కరిముల్లా గుల్లపల్లి పెద్దనాగులు మీరా లా ఆధ్వర్యంలో టిడిపి నియోజకవర్గ ఇన్చార్జ్ కన్నా లక్ష్మీనారా యణ సమక్షంలో టిడిపిలో చేరారు.

'యువగళం'ను విజయవంతం చేయండి

రాజుపాలెం మండలంలో జరగనున్న నారా లోకేష్ యువగళం పాదయాత్రను తెలుగు యువత నాయకులు కార్యకర్తలు అభిమానులు అధిక సంఖ్యలో హాజరై జయప్రదం చేయాలని టిడిపి నియోజకవర్గ ఇన్చార్జ్ కన్నా లక్ష్మీనారాయణ పిలుపునిచ్చారు. సత్తెనపల్లి పివిఎస్ కళ్యాణ మండపంలో తెలుగు యువత నేతలతో వాలంటీర్లతో కన్నా లక్ష్మీనారాయణ మంగళవారం సమావేశం నిర్వహించారు. లోకేష్ పాద యాత్రలో వాలంటీర్లు కీలక పాత్ర పోషించాలన్నారు. ఇదిలా ఉండగా, లోకేష్ బస ప్రాంతం, భోజన ఏర్పాట్లు ప్రదేశాన్ని కన్నా లక్ష్మీనారాయణ పరిశీలించారు. **పెదకూరపాడు:** మండలంలోని తాళ్లూరు, పెదకూరపాడులో తెలుగు మహిళలు మంగళవారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. లోకేష్ పాదయాత్రను జయప్రదం చేయటానికి కదిలి రావాలని కోరుతూ ఆహ్వానం పలికారు.



చిలకలూరిపేటలో మాట్లాడుతున్న పేరుబోయిన వెంకటేశ్వర్లు

మోడీ సర్కారును గద్దె దించేందుకు ఐక్యంగా ముందుకు సాగుదాం

సిఐటియు, ఎఐటియుసి పిలుపు

ప్రజాశక్తి-చిలకలూరిపేట



అన్ని వర్గాల ప్రజల హక్కులను హరించివేస్తూ, నిరరకుశ విధానాలతో పరిపాలన కొనసాగిస్తున్న మోడీ సర్కారును గద్దె దించేందుకు కార్మిక, ఉద్యోగ,కర్షక వర్గాలు ఐక్యంగా ముం దుకు సాగాలని ఎఐటియుసి,సిఐటియు నాయకులు పిలుపు నిచ్చారు. ఎఐటియుసి, సిఐటియు ఆధ్వర్యంలో స్థానిక కళా మందిర్ సెంటర్‌లో మంగళ వారంనాడు మానవహారంగా ఏర్పడ్డారు. ఈ సందర్భంగా ఎఐటియుసి ఏరియా కార్యదర్శి పేరు రామారావు , సిఐటియు మండల కార్యదర్శి పేరు బోయిన వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ఆగస్టు 9న 'క్విట్ ఇం డియా' స్ఫూర్తితో మోడీని గద్దె దింపి దేశాన్ని కాపాడుకోవ డానికి మహా ధర్నాలకు కేంద్ర కార్మిక సంఘాలు, ఉద్యోగ సంఘాలు పిలుపు నిచ్చినట్లు చెప్పారు. ఈ నెల 9వ తేదీన విజయవాడలో మహాధర్నా నిర్వహించనున్నట్లు చెప్పారు. ఇందులో భాగంగా 'క్విట్ మోడీ, సేవ్ ఇండియా' నివాదంతో కార్యక్రమాలు కొనసాగు తున్నట్లు చెప్పారు. మైనార్టీలపై, సామాజిక తరగతులపై సంఘ్ పరివార్ చేస్తున్న దాడులపై వైసిపి, టిడిపి, జనసేనలు నోరు విప్పటం లేదని విమర్శిం చారు. కార్యక్రమంలో ఎఐటియుసి నాయకులు నాయుడు శివ, వెంకటేశ్వర్లు, ఎ.రామకృష్ణ, భగత్ సింగ్,చెంచయ్య, యోగయ్య, పోతురాజు, సిఐటియు నాయకులు ఎం.విల్సన్, ఎస్.బాబు, అనంద కుమార్ పాల్గొన్నారు.



డాక్టర్ కృష్ణమూర్తిని సన్మానిస్తున్న చిత్రం

కొత్త వైద్యుడికి అభివృద్ధి కమిటీ ఘన సన్మానం

ప్రజాశక్తి-సత్తెనపల్లి

సత్తెనపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి పదోన్నతిపై వచ్చిన కొత్త డాక్టర్ కృష్ణమూర్తి మంగళవారం హాజరయ్యారు. మాచర్ల ప్రభుత్వ హాస్పిటల్ నుంచి సత్తెనపల్లి ఏరియా హాస్పిటల్ కి వచ్చిన డాక్టర్ కృష్ణమూర్తి సివిల్ సర్జన్ (అనస్థీషియా) గా పని చేయనున్న ఆయనను ఈ సందర్భంగా ఆసుపత్రి అభి వృద్ధి కమిటీ డైరెక్టర్ కొత్త రామకృష్ణ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. రామకృష్ణ మాట్లాడుతూ మంత్రి అంబటి రాంబాబు ప్రత్యేక కృషి వల్ల హాస్పిటల్లో అన్ని విభాగాలలో డాక్టర్లు ఉన్నారని అన్నారు. పేషెంట్లు పట్ల సేవాభావంతో వైద్యులు పనిచేయాలని కోరారు. హాస్పిటల్ సూపరింటెం డెంట్ లక్ష్మణరావు మాట్లాడుతూ ఈ హాస్పిటల్ కి కావాల్సిన మౌలిక వసతులు ఎప్పటికప్పుడు అందుతున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో ఆర్ఎంఒ శోభారాణి, ఆప్తమాలజిస్ట్ అరుణ కుమారి, నర్సింగ్ సూపరింటెండెట్ రాధ, మెడికల్ సూపర్ వైజర్ విజయలక్ష్మి పాల్గొన్నారు.

విఆర్ఎల సమస్యలను పరిష్కరించండి

- రెండో రోజు కొనసాగిన దీక్షలు, ర్యాలీ
- అంగన్వాడీ, వ్యకాస సంఘీభావం





కలెక్టర్ కు వినతిపత్రం ఇస్తున్న విఆర్ఎలు, ర్యాలీలో విఆర్ఎ లు

ప్రజాశక్తి - పల్నాడు జిల్లా

దీర్ఘకాలంగా నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని కోరుతూ గ్రామ రెవెన్యూ సహాయకుల సంఘం (సిఐ టియు) రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు పల్నాడు జిల్లా విఆర్ఎల సంఘం ఆధ్వర్యంలో గ్రామ రెవెన్యూ సహాయ కులు చేప ట్టిన నిరసన దీక్షలు రెండోరోజు మంగళ వారం రోజు కొన సాగాయి. ధర్నా చౌక్ వద్ద విఆర్ఎ లు అధిక సంఖ్యలో సం ఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన బహిరంగ సభకు సంఘం జిల్లా అధ్యక్షులు షేక్ బందగీ సాహెబ్ అధ్యక్ష వహించారు. ఈ సందర్భంగా శ్రామిక మహిళ సమన్వయ కమిటీ జిల్లా కన్వీనర్ డి.శివకుమారి, సిఐటియు రొంపిచర్ల మండల కార్యదర్శి సరికొండ వెంకటేశ్వరరాజులు మాట్లా డుతూ విఆర్ఎ ల న్యాయమైన సమ స్యలపై ప్రభుత్వం స్పందించి వెంటనే పరి ష్కరించాలని డిమాండ్ చేశారు. జగ న్మోహన్‌రెడ్డి అధికారంలోకి రావడానికి అనేక హామీలు ఇచ్చారని కాంట్రాక్టు ఔట్ సోర్సింగ్ కార్మికులను ఉద్యోగస్తు ను మోసం చేశారని విమర్శించారు. ఎన్నికలకు ముందు అధికారంలోకి రావడం కోసం ముఖ్య మంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ఇచ్చిన హామీ మేరకు విఆర్ఎలకు కనీస వేతనాలు అమలు చేయడంతో పాటు నామినీలుగా పనిచేస్తున్న వారిని విఆర్ ఎలుగా గుర్తించడం, అర్హత ఉన్నవారికి వీఆర్వోలుగా పదోన్నతులు కల్పించాలని కోరారు. జిల్లా అధ్యక్షులు బందగీ సాహెబ్ మాట్లాడుతూ చాలీచాలని వేతనాలతో క్షేత్రస్థాయిలో రెవిన్యూ శాఖలో కీలకంగా పనిచేస్తున్న విఆర్ఎల సమ స్యలపై ప్రభుత్వం వెంటనే స్పందించాలని కోరారు. రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు ఇటీవల మండల కేంద్రాలలో కలెక్టరేట్ వద్ద దీక్షలు విజయవంతం చేసిన విఆర్ఎలు ఈనెల 23, 24 తేదీల్లో విజయవాడలో రాష్ట్ర స్థాయి దీక్షలను 25న 'జగనన్నకు నేరుగా చెబుదాం- చలో విజయవాడ'ను విజయ వంతం చేయాలని పిలుపు నిచ్చారు. అనంతరం ధర్నా చౌక్ నుండి కలెక్టరేట్ వరకు ర్యాలీ నిర్వహించారు. కలెక్టర్ ఎల్. శివశంకర్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు.

కలెక్టరేట్ వద్ద నిరసన కార్యక్రమాన్ని ఉద్దేశించి సిఐటియు జిల్లా ప్రధాన కార్య దర్శి ఎస్.ఆంజనేయనాయక్ మాట్లాడుతూ సమస్యలు పరిష్కరించాలని ప్రభుత్వంతో తేల్చుకునేందుకు విఆర్ఏలు సిద్ధం కావాలని, పల్నాడు జిల్లాలోని వీఆర్ఏలు చలో విజయవాడను జయప్రదం చేయా లని పిలుపు నిచ్చారు. ఎపి అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి జి.మల్లీశ్వరి, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి అనుముల లక్ష్మీశ్వరరెడ్డిలు మాట్లాడుతూ విఆర్ఎ లకు డిఎ వేతనంతో కలిపి ఇవ్వాలని, విఆర్ఎల నుండి డిఎ తిరిగి చెల్లించాలని ఒత్తిడి తీసుకువస్తూ అన్ని జిల్లాల్లో రికవరీ చేశా రని, దీనివల్ల మూడేళ్ల డిఎ ఒకేసారి విఆర్ఎ లు ప్రభు త్వానికి తిరిగి చెల్లిం చాల్సి వస్తుందని అన్నారు. ప్రభుత్వ నిర్ణ యంతో హక్కుగా వస్తున్న విఆర్ఎలు డిఎ కోల్పో యారన్నారు.

రూ 10,500 వేత నంతో పాటు డిఎ కూడా కలిపి ఇచ్చే విధంగా ఉత్తర్వులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఇప్పటివరకు రికవరీ చేసిన డిఎని తిరిగి వారి బ్యాంక్ ఖాతాలకు జమచేయా లని, కరోనా నేపథ్యంలో నెలకు రూ .2 వేలు కోత విధించారని, వెంటనే ఆ వేత`నాన్ని, భూ సర్వే సందర్భంగా టిఎ, డిఎలు చెల్లిం చాలని విఆర్ఎలకు అటెండర్‌గా ప్రమో షన్ ఇవ్వాలని డిమాండ్ చేశారు.

టిడిపి హయాంలోనే గురజాల అభివృద్ధి

- రూ.వేల కోట్లు దోచుకున్న 'క్యాష్' మహేష్‌రెడ్డి
- పిడుగురాళ్ల సభలో నారా లోకేష్ విమర్శలు
- నేడు రాజుపాలెం మండలంలో యువగళం పాదయాత్ర



ప్రజాశక్తి-పిడుగురాళ్ల

టిడిపి హయాంలోనే గురజాల నియోజకవర్గం అభివృద్ధి జరిగిందని ఆ పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ అన్నారు. యువగళం పాద యాత్రలో భాగంగా మంగళవారం పల్నాడు జిల్లా పిడుగురాళ్ల మండలం జూలకల్లు నుంచి జానపాడు లోకేష్ పాదయాత్ర చేశారు. ఈ సందర్భంగా పిడుగురాళ్లలో జరిగిన బహిరంగ సభలో ఆయన మాట్లాడుతూ 2014 నుండి 2019 వరకూ రూ.2265 కోట్లతో నియో జకవర్గాన్ని యరపతినేని శ్రీనివాస్ అభి వృద్ధి చేశారని, రూ.336 కోట్లతో 6 వేల టిడ్కో ఇళ్లు, రూ.216 కోట్లతో ఎన్టీఆర్ గృహాలు, రూ.220 కోట్లతో సిసి రోడ్లు, కమ్యూనిటీ హాల్స్, అంగన్వాడీ భవనాలు, రూ.170 కోట్లతో ఆర్ అండ్ బి రోడ్లు, సాగు, తాగు నీటి ప్రాజెక్టులు, గురజాల, పిడుగురాళ్ల పట్టణాల అభివృద్ధి, రూ.160 కోట్లతో పుష్కర ఘాట్లు ఇలా ఎన్నో అభి వృద్ధి పథకాలు చేపట్టామని వివరించారు. ప్రస్తుత ఎమ్మెల్యేగా గెలిచిన కాసు మహేష రెడ్డి అభివృద్ధిని పక్కన పెట్టి అక్రమార్జన చేస్తున్నారని, ల్యాండ్, శ్యాండ్, వైన్, మైన్ మాఫియాకు గురజాలని అడ్డాగా మార్చా రని ఆరోపించారు. ఆయన్ను కాసు మహేష్ కాదని, క్యాష్ మహేష్‌గా పేరు మార్చాల్సి వచ్చిందన్నారు. అక్రమ మైనిం గ్‌లో రూ.వెయ్యి కోట్లు కొట్టేశాడని, తెలంగాణ మద్యాన్ని తెచ్చి గురజాలలో అమ్మిస్తూ గత నాలుగేళ్లలో రూ.1440 కోట్లు దోచుకున్నాడని, అక్రమ గ్రావెల్ తవ్వకాల ద్వారా రూ.200 కోట్లు, అక్రమ ఇసుక రవాణా ద్వారా రూ.200 కోట్లు, పేకాట క్లబ్బులు, గంజాయి దందా, ప్రభుత్వ భూముల కబ్జా ద్వారా రూ.400 కోట్లు సంపాదించాడని ఆరోపణలు గుప్పించారు. నరసరావుపేటలో రూ.200 కోట్లతో భారీ షాపింగ్ కాంప్లెక్స్, కళ్యాణ మండపం, హైదరాబాద్ గచ్చిబౌలిలో రూ.500 కోట్లతో షాపింగ్ కాంప్లెక్స్ కడుతున్నాడని అన్నారు. నరసరావుపేట మండలం ములకలూరులో 100 ఎకరాలు కొట్టేశారన్నారు. కోడి మేత, సున్నం తయారీ కంపెనీలను బెదిరించి కప్పం కట్టించుకుంటున్నారని అన్నారు. మహేష్ మైనింగ్ దందాకి 8 మంది పిల్లలు బలవ్వగా 11 మంది టిడిపి కార్యకర్తల్ని, నాయకుల్ని హత్య చేయించారన్నారు. 2024లో టిడిపి అధికారంలోకి రావడం ఖాయమని, గురజాలలో భారీ మెజారిటీతో యరపతినేని గెలిపించాలని కోరారు. పరిశ్రమలు తెచ్చి యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామని, టిడిపి హయాంలోనే 80 శాతం పూర్తయిన పిడుగురాళ్ల బైపాస్ రోడ్డును అధికారంలోకి రాగానే పూర్తి చేస్తామని చెప్పారు. టిడ్కో ఇళ్లు పూర్తి చేసి లబ్ధిదారులకు అందజేస్తా మన్నారు. యరపతినేని శ్రీనివాసరావు మాట్లాడుతూ అణచివేత ఎక్కడుంటుందో తిరుగుబాటు అక్కడే ఉంటుందని జగన్ తెలుసుకోవాలన్నారు. కాసు మహేష్‌రెడ్డి అక్రమాలు, దౌర్జన్యా లతో రూ.4వేల కోట్లు దోచుకున్నాడనే విషయం ప్రజలందరికి తెలుసన్నారు. అధికారాన్ని అడ్డుపెట్టుకుని రెచ్చి పోయిన వైసిపి నాయకులకు ప్రజలు జవాబు చెబుతారని అన్నారు. ఇదిలా ఉండగా పిడుగు రాళ్ల రాజీవ్ గాంధీ విగ్రహం వద్ద దళితులు నారా లోకేష్‌ను కలిసి వినతిపత్రం ఇచ్చారు. లోకేష్ మాట్లా డుతూ ఎస్సీలకు ఖర్చు చేయాల్సిన రూ.28,147 కోట్ల సబ్‌ప్లాన్ నిధులను ప్రభుత్వం దారిమళ్లిం చిందన్నారు. తాము అధికారంలోకి వచ్చాక అంబేద్కర్ విదేశీ విద్య పథకాన్ని పునరుద్ధరిస్తామని చెప్పారు.

పిడుగురాళ్ల మండలంలో అపూర్వస్పందన

పాదయాత్ర 178వ రోజున పిడుగు రాళ్ల మండలం జూలకల్లుకు మంగళవారం చేరుకోగా మాజీ ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాస్‌రావు, టిడిపి శ్రేణులు ఘన స్వాగతం పలికారు. ఉదయం 9 గంటలకు ప్రారంభమైన పాద యాత్ర మధ్యాహ్నం రెండు గంటలకు జానపాడుకు చేరుకుంది. గుర్రాలు, ఒంటెలు, డప్పు వాయిద్యాలు, ఆదివాసి నృత్యాలు ఆకర్షణగా నిలిచాయి. కార్యక్రమంలో టిడిపి పల్నాడు జిల్లా అధ్యక్షులు జీవీ ఆంజనేయులు, మాజీ మంత్రులు కన్నా లక్ష్మీనారాయణ, నక్కా ఆనందబాబు, పత్తిపాటి పుల్లారావు, ఆలపాటి రాజేంద్రప్రసాద్, నరసరావుపేట, మాచర్ల నియోజకవర్గ ఇన్‌ఛార్జులు డాక్టర్ చదలవాడ అరవిందబాబు, జూలకంటి బ్రహ్మారెడ్డి పాల్గొన్నారు.

యువగళం నేటి పాదయాత్ర వివరాలు

ఉదయం 8 గంటలకు పిడుగురాళ్ల వావెళ్ల గార్డెన్స్ నుంచి పాదయాత్ర ప్రారంభం... 8.30 గంటలకు సత్తెనపల్లి అసెంబ్లీ నియోజకవర్గంలోకి ప్రవేశం... 8.45 గంటలకు కొండమోడులో స్థానికులతో సమావేశం... 10.45 గంటలకు అనుపాలెంలో స్థానికులతో సమావేశం... మధ్యాహ్నం 12.15 గంటలకు చౌటపాపాయపాలెంలో భోజన విరామం... సాయంత్రం 4 గంటలకు చౌటపాపాయపాలెం నుంచి పాదయాత్ర కొనసాగింపు... 4.30 గంటలకు చౌటాయపాపాయపాలెంలో బహిరంగ సభ... 6.15 గంటలకు పాదయాత్ర పెదకూరపాడు నియోజకవర్గంలోకి ప్రవేశం... రాత్రి 7.15 గంటలకు నాగిరెడ్డిపాలెంలో స్థానికులతో సమావేశం... 7.30 గంటలకు బెల్లంకొండలో బుడ్గ జంగాలతో సమావేశం... 8.15 గంటలకు మాచాయపాలెంలో స్థానికులతో సమావేశం... 10.15 గంటలకు మాచాయపాలెం విడిదికేంద్రంలో బస.

హామీలను అమలు చేయకుంటే సిఎం ఇంటి ముట్టడి

కలెక్టరేట్ వద్ద రెండ్రోజుల ధర్నాలో విఆర్ఎల సంఘం రాష్ట్ర కార్యదర్శి ఎం.బాలకాశి - డిఆర్ఒకు వినతి



ధర్నాలో మాట్లాడుతున్న విఆర్ఎల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.బాలకాశి

ప్రజాశక్తి-గుంటూరు

విఆర్ఎలకు ముఖ్యమంత్రి ఇచ్చిన హామీలు అమలు చేయకుంటే 25న చలో విజయవాడ నిర్వహిస్తామని, అవసరమైతే సిఎం ఇంటిని ముట్టడిస్తామని ఎపి విఆర్ఎల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.బాలకాశీ అన్నారు. ఎపి గ్రామ రెవెన్యూ సహాయకులు సంఘం (సిఐటియు) ఆధ్వర్యంలో కలెక్టరేట్ వద్ద చేపట్టిన రెండ్రోజుల ధర్నాలో భాగంగా మంగళ వారం బాలకాశి ముఖ్యవక్తగా హాజర య్యారు. ధర్నా అనంతరం డిఆర్ఓ కె.చంద్రశేఖర్‌రావుకు వినతిపత్రం అందచే శారు. ధర్నాకు గుంటూరు జిల్లా విఆర్ఎల అధ్యక్షులు వి.బాజీబాబు అధ్యక్షత వహించారు. బాలకాశీ మాట్లాడుతూ విఆర్ఎల సమస్యల పట్ల రాష్ట్ర ప్రభుత్వం తీవ్ర నిర్లక్ష్యం ప్రదర్శిస్తోందన్నారు. కనీస వేతనాలు అమలు చేయాలని, నామినీల సమస్య పరిష్కరించాలని, ప్రమోషన్లు కల్పించాలని ఈ ప్రభుత్వాన్ని కోరినా ఒక్క సమస్య కూడా పరిష్కారం కాలేదన్నారు. 2018లో జగన్మోహన్‌రెడ్డి ప్రతిపక్ష నేత హోదాలో విఆర్ఎల ధర్నా టెంట్ వద్దకు వచ్చి వైసిపి ప్రభుత్వం రాగానే వేతనాలు పెంచుతామని, ఇతర సమస్యలు పరిష్కరి స్తామని వాగ్దానం చేసి, అధికారంలోకి రాగానే విస్మరించారని విమర్శించారు. హామీలు అమలు చేయకపోగా కేవలం రూ.10500 వేతనం పొందుతున్న వారి నుండి గత ప్రభుత్వం మంజూరు చేసిన రూ.300ల డిఎను కూడా రికవరీ చేయటం అన్యాయమన్నారు. పక్కనే ఉన్న తెలంగాణ రాష్ట్రంలో అక్కడి ప్రభుత్వం విఆర్ఎ వ్యవ స్థను రద్దు చేసి, అర్హతను బట్టి విఆర్ఎలను వివిధ శాఖల్లో విలీనం చేసిందని, ఏపీలోనూ అలా చేయటానికి సమస్య ఏమి టని ప్రశ్నించారు. విఆర్ఎలు ఎక్కువ మంది ఎస్సీ, ఎస్టీ, బడుగు బలహీన వర్గాల వారేనని, సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం ముందుకు రాకపోవడం దుర్మార్గమని అన్నారు. సంఘం జిల్లా గౌరవ అధ్యక్షులు బి.లక్ష్మణరావు మాట్లాడు తూ ఇప్పటివరకు ఏ ప్రభుత్వం ఉన్నా వీఆర్ఏలకు ఏమాత్రం హక్కులు సాధించు కున్నా అది కేవలం పోరాటం ద్వారానే సాధ్యమైందన్నారు. జగన్ ప్రభుత్వం అత్యంత నిర్బంధంగా, సమస్యలు పరిష్కరి ంచడంలో నిర్లక్ష్యంగా ఉందన్నారు. ధర్నాలో ఆటో వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు ఎన్.శివాజీ, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి బి.ముత్యాలరావు, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి వై.నేతాజీ, సిఐటియు నగర ప్రధాన కార్యదర్శి కె.శ్రీనివాసరావు, రాజధాని ప్రాంతీయ కార్యదర్శి ఎం.భాగ్యరాజు, ఫిరంగిపురం మండల కార్యదర్శి ఎస్.యం.వలి, వర్కింగ్ ప్రెసిడెంట్ కె.సంగయ్య, ప్రధాన కార్యదర్శి షేక్ నాగుల్ మీరా, ఉపాధ్యక్షులు జె.రాజేష్, సాంబశివరావు పాల్గొన్నారు.



విద్యార్థులను అభినందిస్తున్న అన్నా నందకిషోర్ తదితరులు

సిఎ ఫౌండేషన్ ఫలితాల్లో శ్రీమేధ విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి-గుంటూరు

ది ఇనిస్టిట్యూట్ ఆఫ్ చార్టెర్డ్ అకౌంటెంట్స్ ఆఫ్ ఇండియా ఆగస్టు 7న ప్రకటించిన సిఎ ఫౌండేషన్ ఫలితాల్లో శ్రీమేధ విద్యార్థులు ఆలిండియా టాప్ మార్కులతోపాటు, అత్యధిక ఉత్తీర్ణత శాతం సాధించారని సంస్థ ఛైర్మన్ అన్నా నందకిషోర్ తెలిపారు. తమ విద్యార్థి ఎ.వెంకటసాయి 400 మార్కులకుగాను 335 మార్కులతో టాపర్‌గా నిలిచాడన్నారు. ఎం.మోక్షిత 313, షేక్.ఇర్ఫాన్ 301, డి.లక్ష్మీనరసింహ 298, టి.వరలక్ష్మి 296, డి.నాగచంద్రిక 285 మార్కులు సాధించారని వివరించారు. సిఎ ఫౌండేషన్ ఫలితాల్లో అత్యుత్తమ మార్కులు సాధించటానికి కారణమైన శ్రీమేధ అధ్యాపక, సిబ్బంది సహకారం ఎంతగానో ఉందన్నారు. ఉత్తీర్ణులైన విద్యార్థులకు సిఎ ఇంటర్ క్లాసులు, ఉత్తీర్ణులు కాని విద్యార్థులకు సిఎ ఫౌండేషన్ క్లాసులు ఈ నెల 11 నుండి ప్రారంభం అవుతాయని తెలిపారు. విద్యార్థులను చైర్మన్ నందకిషోర్, డైరెక్టర్ శ్రీలక్ష్మి, అధ్యాపకులు అభినందించారు.



13న స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా పోటీలు

ప్రజాశక్తి-గుంటూరు : స్వాతంత్ర్య దినోత్సవంపై జన విజ్ఞాన వేదిక, స్టూడెంట్ యూనియన్ ఫర్ నేషన్ (సన్) సంయుక్త ఆధ్వర్యంలో ఈనెల 13న పాఠశాల విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వం, డ్రాయింగ్, క్విజ్ పోటీలు నిర్వహిస్తున్నట్లు జెవివి జిల్లా అధ్యక్షులు డాక్టర్ ఎ.సత్యనారాయణ ప్రసాద్ తెలిపారు. కరపత్రాలను మంగళ వారం బ్రాడీపేటలో ఆవిష్కరించారు. సత్యనారాయణ ప్రసాద్ మాట్లాడుతూ ఆదివారం ఉదయం 9.30 గంటలకు పాటిబండ్ల సీతారామయ్య హైస్కూల్లో పోటీలు ఉంటాయన్నారు. 5, 6, 7 తరగతుల విద్యార్థులు జూనియర్లుగా, 8, 9, 10 విద్యార్థులు సీనియర్లుగా పోటీలుంటాయని, ప్రవేశ రుసుమేమీ ఉండదని అందరూ ఆహ్వానితులేనని చెప్పారు. కార్యక్రమంలో సన్ ప్రతినిధులు కె.సాయికుమార్, దేవసూర్య, పవన్, మణి, భార్గవ్, ఆదిత్య, వినయ్, జెవివి నాయకులు టి.జాన్‌బాబు, టి.ఆర్.రమేష్, బి.శంకర్‌సింగ్, బి.ప్రతాప్‌సింగ్, డి.ప్రవీణ్, హనుమంతరాజు పాల్గొన్నారు.

పెదవడ్లపూడి హైలెవల్ ఛానల్ ఎత్తిపోతలను పూర్తి చేయాలి



ఈఈకి వినతిపత్రం అందచేస్తున్న నాయకులు

ప్రజాశక్తి-గుంటూరు

పెదవడ్లపూడి హైలెవెల్ ఛానల్ ఎత్తిపోతల పథకం వెంటనే పూర్తి చేసి 6 మండలాల పరిధిలోని 25 ఎకరాల సాగు భూమికి నీరు విడుదలయ్యేలా చూడాలని ఎపిఎస్ఐడిసి ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఎం.రవిశంకరన్, ఎఇ సుబ్బారావుకు రైతు సంఘ: నాయకులు మంగళవారం వినతిపత్రం అందజేశారు. సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు జొన్నా శివశంకర్, కంచుమాటి అజయ్‌కుమార్ మాట్లాడుతూ ప్రకాశం బ్యారేజ్ నుండి బంకింగ్ హామ్ కాల్వ ద్వారా కృష్ణా, పశ్చిమ డెల్టాకు సాగునీరు వస్తుందని, బంకింగ్ హామ్ కాల్వ కంటే ఎత్తులో పెదవడ్లపూడి హైలెవెల్ ఛానల్ ఉండటం వలన బంకింగ్ కెనాల్‌లో ప్రవాహం అధికంగా ఉన్నప్పుడు మాత్రమే నీరు వస్తోందని చెప్పారు. బంకింగ్ హామ్ కెనాల్‌లో నీటి ప్రవాహం 2000 క్యూసెక్కుల కంటే తక్కువగా ఉన్నప్పుడు నీరు సక్రమంగా అందటేదని, సమస్య పరిష్కారానికి 2017లో ఎత్తిపోతల పథకానికి శంకుస్థాపన చేశారని, రూ.9 కోట్లతో చేపట్టిన నిర్మాణ పనులు 70 శాతం వరకు పూర్తయ్యాయని వివరించారు. ఈ పథకానికి అవసరమయ్యే మోటారు పంపులు వచ్చాయని, వీటిని అమర్చే పనులు చేయాల్సి ఉందన తెలిపారు. కాంట్రాక్టర్‌కు బిల్లు చెల్లించకపోవడం వలన ఈ ఆరేళ్ల నుంచి పనులు పెండింగ్‌లో ఉన్నాయని, తక్షణమే నిధులను విడుదల చేసి ఈ పథకాన్ని అందుబాటులోకి తెచ్చి సాగు భూమికి నీరు అందించాలని కోరారు. బడ్జెట్ వచ్చిన వెంటనే నిర్మాణ పనులు పూర్తి చేసి రైతులకు న్యాయం చేస్తామని ఇఇ హామీ ఇచ్చారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో సంఘం జిల్లా ఉపాధ్యక్షులు ఎం.శివసాంబిరెడ్డి, కె.పూర్ణచంద్ర ఉన్నారు.

సామాన్య కుటుంబం నుంచి అసమాన స్థాయికి జాన్సన్



జాన్సన్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న డాక్టర్ రత్నాకర్, సుకుమార్ తదితరులు

ప్రజాశక్తి-తెనాలి

సామాన్య కుటుంబంలో పుట్టి అసమాన స్థాయికి ఎదిగిన కవి, నటుడు మోదుకూరి జాన్సన్ అని ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం జియాలజి విభాగాధిపతి డాక్టర్ పి.జోసఫ్ రత్నాకర్ అన్నారు. స్థానిక కొత్తపేట పెన్షనర్స్ అసోసియేషన్ హాల్లో జాన్సన్ జయంతిని మంగళవారం నిర్వహించారు. సభకు అధ్యక్షత వహించిన డాక్టర్ రత్నాకర్ మాట్లాడుతూ తెనాలి మండలం కొలకలూరుకు చెందిన జాన్సన్ నటనాలయం నాటకం రచనతో రచయితగా, నటుడుగా ప్రసిద్ధి చెందారన్నారు. సినీ మాటల రచయితగా, నటుడిగానూ వెండితెరకు పరిచయమయ్యారన్నారు. అగ్ర నటులు శోభన్‌బాబు, కృష్ణ, ఎఎన్ఆర్, ఎన్టీఆర్ వంటి మహా నటులు నటించిన దేవాలయం, పాడిపంటలు, డుబ్బుకు లోకం దాసోహం వంటి చిత్రాలతో అయన సినీ రంగ ప్రస్థానం అప్రతిహతంగా కొనసాగిందన్నారు. కరుణామయుడు చిత్రంలో రాసిన మాటలు, పాటలు ఆయన సాహిత్య పటిమకు అద్దం పట్టాయని కొనియాడారు. డాక్టర్ వల్లూరి రామారావు మాట్లాడుతూ సాహితీ రంగంలో ఓ దిగ్గజంగా జాన్సన్ వెలుగొందారని అన్నారు. అనతరం సీనియర్ ఎపిపి ఎస్.సుకుమార్, సీనియర్ న్యాయవాది ఇందుపల్లి రాజారామ్, పినపాటి రవికుమార్ మాట్లాడారు. తొలుత జాన్సన్ చిత్రపటానికి పూలమాలలేసి నివాళులర్పించారు. విద్యుత్ రిటైర్డ్ ఎస్ఇ పి.బి.కరుణాకర్, డాక్టర్ కె.రాజ్‌కుమార్, ఎస్.మురళీధర్, డి.అనిల్‌కుమార్, కె.రమేష్, ఎం.లీలాకుమార్, గురుదేవ్, శైలేంద్ర పాల్గొన్నారు.



ట్రోఫీతో విజేతగా నిలిచిన విశాఖ మార్వెల్ జట్టు

ఫిజియో క్రికెట్ లీగ్ విజేత విశాఖ 'మార్వెల్ టీం'

ప్రజాశక్తి - గుంటూరు

ఆంధ్రప్రదేశ్ ఫిజియోథెరపిస్ట్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఆర్‌విఆర్ ఇంజినీరింగ్ కాలేజీ గ్రౌండ్ నంబూరు ఎం.ఎస్.కె క్రికెట్ మైదానంలో ఐదు రోజులపాటు నిర్వహించిన రాష్ట్రస్థాయి ఫిజియో క్రికెట్ లీగ్ టి20 విజేతగా విశాఖపట్నంకు చెందిన మార్వెల్ టీం నిలిచింది. రన్నరప్‌ను విజయవాడుకు చెందిన బిబిసి - ఎస్‌జిఎస్ సూపర్‌కింగ్స్ జట్టు సాధించింది. ఆయా జట్లకు రూ.లక్ష, రూ.50 వేలు చొప్పున నగదు బహుమతులు, షీల్డ్‌లను మంగళవారం నిర్వహించిన బహుమతి ప్రదానోత్సవంలో అందించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, హారిక ఫిజియో విద్యా సంస్థల అధినేత షేక్ సుభాని మాట్లాడుతూ రాష్ట్ర స్థాయిలో దశాబ్ద కాలం క్రితం ఏర్పడిన ఫిజియోథెరపీ ఫెడరేషన్ ఫిజియోథెరపీ రాష్ట్ర కౌన్సిల్ ఏర్పాటుతోపాటు సభ్యుల సహకారంతో పర్యావరణ పరిరక్షణ కార్యక్రమాలు, సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. నిర్వహణ కమిటీ చైర్మన్ డాక్టర్ మహమ్మద్ ఇమ్రాన్ మాట్లాడుతూ ఫెడరేషన్ కమిటీ సభ్యులు, క్రికెట్ టోర్నీ విజయవంతంగా నిర్వహించడంలో ఫెడరేషన్ నాయకులు డాక్టర్ ఎన్.శరత్ చంద్రకుమార్, డాక్టర్ నాగసతీష్, డాక్టర్ బివి హరికృష్ణ ఇతర సభ్యులు, సహకరించిన దాతలకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో మార్వెల్ వెల్నెస్ ప్రొడక్ట్స్ అధినేత ముప్పరాజు వెంకట్రావు, తులసి సర్జికల్స్ సంజీవ్ కుమార్, డాక్టర్ దయాకర్, డాక్టర్ ఏడుకొండలు, డాక్టర్ రాజేంద్రప్రసాద్, డాక్టర్ విష్ణువర్ధన్ పాల్గొన్నారు.



యూనివర్సల్ ఇంజినీరింగ్ కాలేజీలో మాట్లాడుతున్న రాయుడు

కుల, మత విభేదాలను పక్కన పెట్టండి

విద్యార్థులతో క్రికెటర్ అంబటి రాయుడు

ప్రజాశక్తి - మేడికొండూరు

మండలంలోని పలు గ్రామాల్లో మాజీ క్రికెటర్ అంబటి రాయుడు మంగళవారం పర్యటించారు. తొలుత మేడికొండూరు జెడ్‌పి హైస్కూల్‌కు వెళ్లి అక్కడ విద్యార్థులతో మాట్లాడి ప్రభుత్వం ద్వారా అందుతున్న సౌకర్యాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం డోకిపర్రును సందర్శించి పలువురితో మాట్లాడారు. సమీపంలో ఉన్న యూనివర్సల్ ఇంజినీరింగ్ కళాశాలలో విద్యార్థులతో మాట్లాడారు. కుల, మత విభేదాలు లేకుండా దేశ, రాష్ట్ర అభివృద్ధి కోసం ముందుకు సాగాలని సూచించారు. చదువులతో మాత్రమే కాదు గాని, క్రీడలతో కూడా జీవితంలో ఉన్నత శిఖరాలను చేరుకోవచ్చని అన్నారు. కార్యక్రమంలో మేడికొండూరు జెడ్‌పిటిసి కె.సిద్దయ్య, కళాశాల సెక్రటరీ - కరస్పాండెంట్ రెవరెండ్ ఫాదర్ ఎం.ఫాతిమా మర్రెడ్డి, కళాశాల అసిస్టెంట్ డైరెక్టర్ రెవరెండ్ ఫాదర్ సిహెచ్ కిషోర్‌బాబు, ప్రిన్సిపల్ డాక్టర్ సిహెచ్ కేశవరెడ్డి, డిప్లమా ప్రిన్సిపల్ ఎం.జయరాంరెడ్డి, పీడీ జి.మర్రెడ్డి పాల్గొన్నారు.

ఓటర్ల జాబితా సర్వే సక్రమంగా నిర్వహించాలి

ప్రజాశక్తి - పల్నాడు జిల్లా

జిల్లాలో ఓటర్ల జాబితా ఇంటింటి సర్వే సక్రమంగా జరిగేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ శివశంకర్ లోతేటి పేర్కొన్నారు. రొంపిచర్ల మండలంలోని విప్పర్ల రెడ్డి పాలెం గ్రామంలో జరుగుతున్న ఓటర్ల జాబితా సర్వే జరుగుతున్న తీరును జిల్లా కలెక్టర్ ఆకస్మిక తనిఖీ చేశారు.సర్వే జరుగుతున్న తీరును పరిశీలించి బూత్ లెవల్ అధికారులతో మాట్లాడారు. పలువురు ఓటర్లతో జిల్లా కలెక్టర్ మాట్లాడి వారికున్న అనుమానాలను నివత్తి చేశారు. ఓటర్ల జాబితా రూపొందించడానికి తీసుకోవాల్సిన జాగ్రత్తలపై జిల్లా కలెక్టర్ పలు సూచనలు చేశారు. నరసరావుపేట అసెంబ్లీ నియోజకవర్గ అంశాలపై పలు ఆదేశాలను బూత్ లెవల్ ఆఫీసర్లు కు ఇచ్చి, త్వరిత గతిన సర్వే ప్రక్రియను పూర్తి చేయాలన్నారు.

విద్యా సర్వే ప్రక్రియపై ఆకస్మిక తనిఖీ

జిల్లాలో వాలంటీర్లు చేపట్టిన ఎడ్యుకేషన్ సర్వే ప్రక్రియపై రొంపిచర్ల మండలం సంతగుడిపాడు లో కలెక్టర్ శివశంకర్ మంగళవారం ఆకస్మిక తనిఖీ చేశారు. సర్వే ప్రక్రియ క్షేత్ర స్థాయిలో తల్లిదండ్రులతో మాట్లాడుతున్న తీరును ఆయన అడిగి తెలుసుకున్నారు. అనంతరం గ్రామ సచివాలయంలో జిల్లా విద్యా శాఖ అధికారి, మండల స్పెషల్ ఆఫీసర్, తహశీల్దార్, మండల విద్యా శాఖ అధికారి, మండల అభివద్ది అధికారి, ఆయా ప్రభుత్వ జిల్లా పరిషత్, మండల పరిషత్ ప్రధానోపాధ్యాయు లతో వాలంటీర్లు, ఎం.ఎస్.ఎస్.కే లు, వెల్ఫేర్ అసిస్టెంట్, ఇతర అధికారులతో కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. సర్వే ప్రక్రియను సమర్ధవంతంగా పూర్తి చేయాలని ఆదేశించారు. బడి మానేసిన వారు, బడి బయట ఉన్న వారి వివరాలను సేకరించి, వారి బడులలో చేరేలా చర్యలు తీసుకోవాలని, ఒకవేళ బడికి వెళ్లకుంటే గల కారణాలను నివేదికలో తెలియ జేయాలని సూచించారు.సర్వే ప్రక్రియ కార్యక్రమాన్ని మరింత వేగంగా జరిగేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

కౌమారదశ బాలికల్లో రక్తహీనతను తగ్గించేందుకు చర్యలు

జిల్లా వ్యాప్తంగా కౌమార దశ బాలికలలో ఉన్న రక్తహీనత శాతాన్ని తగ్గించేందుకు వైద్య ఆరోగ్య శాఖ, మహిళా శిశు సంక్షేమ శాఖలు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. మంగళవారం వైద్య ఆరోగ్య శాఖ, మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ప్రధానంగా జిల్లా వ్యాప్తంగా బడిలో చదువుతున్న బాలికలు, బడి బయట ఉన్న బాలికలను గుర్తించి వారిలో ఉన్న రక్తహీనత సమస్యను గుర్తించడంతో పాటుగా వారికి ఆరోగ్యం పై అవగాహన కల్పించి, పౌష్టికాహారం అందించడం ద్వారా సరైన మందులు అందించి బాలికల ఆరోగ్య పరిరక్షణకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.



విప్పర్లరెడ్డిపాలెలో సిబ్బందితో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్, ప్రక్కన ఆర్డీఓ, తహశీల్దార్

రీసర్వేలో లోటుపాట్లకు తావివ్వొద్దు

ప్రజాశక్తి- రెంటచింతల

మండలంలోని వివిధ గ్రామాల్లో భూముల రీసర్వేకు సంబంధించి ఇప్పటి వరకు ఎన్ని ఎకరాలు చేశారు? ఇంకా చేయాల్సింది ఎంత? ఎప్పటికి సర్వే పూర్తవుతుంది ? ఇప్పటి వరకు ఎన్ని సర్వేరాళ్లు వచ్చాయి అనే అంశాలపై గురజాల ఆర్డీవో కె. అద్దయ్య మంగళవారం తహశీల్దార్ కార్యాలయంలో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అద్దయ్య మాట్లాడుతూ భూ రీ సర్వేలో ఎలాంటి లోటుపాట్లు ఉండకూడదని, సమస్యలు ఏవైనా ఉంటే యజమానితో చర్చించాలని సూచించారు. పశర్లపాడులో 2170.62 ఎకరాలు, మిట్ట గుడిపాడులో 3400 ఎకరాల సర్వే జరుగుతోందని, 50 శాతం సర్వే పూర్తయిందని తహశీల్దార్ కె.పుల్లారావు తెలిపారు. సమావేశంలో డిటీ రాజారావు, ఆర్ ఐ కాంతారావు. సర్వేయర్ సుధాకర్ పాల్గొన్నారు.



సమీక్ష సమావేశంలో గురజాల ఆర్డీవో కె. అద్దయ్య

మరణించిన వారి పేర్లు తొలగించండి

ప్రజాశక్తి-పెదకూరపాడు



మరణించిన వారి పేర్లు ఓటర్ల దష్టిలో నుంచి తొలగించాలని పెదకూరపాడు నియోజకవర్గ రిటర్నింగ్ ఆఫీసర్ రామచంద్రరావుని రాజకీయ నాయకులు కోరారు. మంగళవారం తహశీల్దార్ కార్యాలయంలో రాజకీయ పార్టీల నాయకుల సమావేశం జరిగింది. డబుల్ ఎంట్రీలు, గుర్తు తెలియని ఓట్లు సుమోటోగా తీసేయాలని కోరారు. పరిశీలిస్తామని రిటర్నింగ్ ఆఫీసర్ తెలిపారు. సమావేశంలో తహసిల్దార్లు వరుసగా పెదకూరపాడు, , బెల్లంకొండ, , క్రోసూరు, అచ్చంపేట, అమరావతి , క్షమారాణి దుర్గేష్ జియా, పద్మాదేవి, విజయశ్రీ, వైసిపి నాయకులు సాంబి రెడ్డి, మీరయ్య, అనీలు, హనుమంతరావు, కోటయ్య, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

తొలి రోజు ఒక్క నామినేషనూ దాఖలు కాలేదు

ప్రజాశక్తి-అచ్చంపేట

మండల పరిధిలోని మాదిపాడు, చెరుకుంపాలెం, కొండూరు గ్రామాలలో నాలుగు వార్డు మెంబర్లకు సంబంధించి తొలిరోజున ఒక నామినేషన్ కూడా దాఖలు కాలేదు. ఈ విషయాన్ని అచ్చంపేట మండల అభివృద్ధి అధికారి శివ సుబ్రహ్మణ్యం మంగళవారం తెలిపారు. మాదిపాడులో 4వ వార్డు ఎస్సీ జనరల్, చెరుకుపాలెం లో 10వ వార్డు బీసీ జనరల్, కొండూరులో 10, 11వ వార్డులను బిసి మహిళలకు కేటాయించారన్నారు వార్డు మెంబర్లకు నామినేషన్లకు స్వీకరణకు చివరి తేదీ ఈ నెల 10 అని అన్నారు.

దమ్ముంటే నాపై ఆరోపణలు నిరూపించండి

లోకేష్‌కు ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి సవాల్

ప్రజాశక్తి-మాచర్ల



'దమ్ముంటే నా మీద చేసిన ఆరోపణలను నిరూపించగలవా లోకేష్' అంటు ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే పిన్నెల్లి రామక్రిష్ణారెడ్డి సవాల్ విసిరారు. స్థానిక పార్టీ కార్యాలయంలో మంగళవారం విలేకరులతో ఆయన మాట్లాడుతూ ప్రజలను మభ్యపెట్టేందుకు తెలుగుదేశం నాయకులు నియోజకవర్గంలో పర్యటిస్తున్నారని విమర్శించారు. గతంలో ఆగస్టులో వచ్చిన లోకేష్ మాచర్లను దత్తత తీసుకోని అభివృద్ధి చేస్తామని చెప్పిన విషయాన్ని గుర్తుచేశారు. మరో ఆగష్టులో వచ్చి వరికపూడిశెల ప్రాజెక్ట్‌కు ఫేక్ జివో ఇచ్చారని ఆగ్రహం వ్యక్తం చేశారని, ప్రస్తుత ఆగస్టులో వచ్చి వరికపూడిశెల ప్రాజెక్ట్‌కు శంకు స్థాపన అంటున్నారని వివరించారు. వచ్చే ఆగస్టుకు తండ్రీ కొడుకులను ఇద్దరిని హైదరాబాద్ పిచ్చి ఆసుపత్రికి ఆంధ్ర ప్రజలు పంపిస్తారని వ్యాఖ్యలు చేశారు.వార్డు మెంబర్‌గా గెలవలేని లోకేష్‌ను ,తాను మాచర్లలో ఏకగ్రీవంగా వార్డు మెంబర్‌గా గెలిపిస్తానంటూ సెటైర్లు విసిరారు. ఎవరో రాసిచ్చిన స్క్రిప్ట్ చదవడం కాదు, నియో జకవర్గంపై అవగాహనతో మాటాడాలని లోకేష్‌కు సూచిం చారు. 'నువ్వు పెట్టిన పెయిడ్ ఆర్టిస్టు ఇప్పటికే నాపై రెండు సార్లు ఓడి గుంటూరు పారిపోయారు' అని గుర్తుచేశారు. ఐదుసార్లు మాచర్ల ప్రజలు తనను గెలిపించిన అంశాన్ని గుర్తు పెట్టుకోవా లన్నారు. యరపతినేని, చంద్రబాబు, లోకేష్‌ల వద్ద ప్యాకేజీలు మాట్లాడుకునే బ్రహ్మారెడ్డికి తమను విమర్శించే స్థాయి లేదన్నారు. సమావేశంలో వైసిపి రాష్ట్ర యువజన ప్రధాన కార్యదర్శి పిన్నెల్లి వెంకటరామిరెడ్డి పాల్గొన్నారు.

లోకేష్‌పై విమర్శలు చేసే స్థాయి పిన్నెల్లికి లేదు

టిడిపి పల్నాడు జిల్లా అధ్యక్షులు జీవీ ఆంజనేయులు

ప్రజాశక్తి-పిడుగురాళ్ల



తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ పై విమర్శలు చేసే స్థాయి ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డికి లేదని పల్నాడు జిల్లా టిడిపి అధ్యక్షుడు జీవీ ఆంజనేయులు అన్నారు. మంగళవారం మండల పరిధిలోని జానపాడులో నిర్వహిస్తున్న యువగళం పాదయాత్రలో భాగంగా పల్నాడు జిల్లా నియోజకవర్గ ఇన్‌ఛార్జిలతో కలిసి విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జివి ఆంజనేయులు మాట్లాడుతూ లోకేష్ ఎక్కడ పాదయాత్ర చేస్తే అక్కడి వైసిపి ఎమ్మెల్యేలు తమ ప్రాంతంలో పోటీ చేయాలని అనడం చూస్తుంటే ఇదంతా తాడేపల్లి స్క్రిప్ట్‌లా ఉందని విమ ర్శించారు. ఈ సందర్భంగా వినుకొండ ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడుపై విమర్శలు గుప్పించారు. ఆగ డాలు మరింతగా పెరిగిపోయాయని ప్రజలు త్వరలో బుద్ధి చెబుతారని అన్నారు.మాచర్ల నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి జూలకంటి బ్రహ్మారెడ్డి మాట్లాడుతూ గతంలో మాచర్లలో విగ్రహాల దొంగతనం చేసి పోలీసులకు పట్టుబడిన రామకృష్ణారెడ్డి, అతని సోదరుడు వెంకట రామిరెడ్డిలు లోకేష్ గురించి మాట్లాడటం హాస్యాస్పదంగా ఉందని అన్నారు. మాచర్ల నియోజకవర్గంలో వారు చేస్తున్న అవినీతికి అక్రమాలకు త్వరలో తెరపడనుందని అన్నారు. గురజాల మాజీ ఎమ్మెల్యే యర పతినేని శ్రీనివాసరావు మాట్లాడుతూ లోకేష్, చంద్రబాబుపై వైసిపి నాయకులు చౌకబారు మాటలు మాట్లాడటం తగదని అన్నారు. మాజీ మంత్రి పత్తిపాటి పుల్లారావు మాట్లాడుతూ లోకేష్‌పై మాచర్ల ఎమ్మెల్యే పిన్నెల్లి చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నట్లు చెప్పారు. సమావేశంలో నరసరావుపేట నియోజకవర్గ ఇన్‌ఛార్జి చదలవాడ అర వింద్ బాబు, రాష్ట్ర నాయి బ్రాహ్మణ సంఘం మాజీ అధ్యక్షులు జి.నాగేశ్వరరావు, రాష్ట్ర విభిన్న ప్రతిభా వంతుల కార్పొరేషన్ మాజీ చైర్మన్ జి.కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఎస్కేబిఆర్ అధ్యాపకునికి డాక్టరేట్

అభినందించిన ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి

ప్రజాశక్తి-విజయపురిసౌత్



ఎస్కేబిఆర్ జూనియర్ ప్రభుత్వ కళాశాల మాచర్లలో తెలుగు అధ్యాపకులుగా పనిచేస్తున్న పి శ్రీనివాసరావు ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం నుండి డాక్టరేట్ అందుకున్నారు. ప్రజా కవి సుంకర సత్యనారాయణ జీవితం సాహిత్యం అనే అంశంపై డాక్టర్ చింతపల్లి సత్యనారాయణ పర్యవేక్షణలో పరిశోధన చేసి డాక్టరేట్ పొందడం జరిగిందని ఎస్ కే బి ఆర్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ బుల్లయ్య తెలిపారు. ఈ సందర్భంగా డాక్టరేట్ పొందిన అధ్యాపకులు పి శ్రీనివాసరావును ప్రభుత్వ విప్, మాచర్ల శాసనసభ్యులు పిన్నెల్లి రామకృష్ణారెడ్డి ఆయన కార్యాలయంలో అభినందించి సన్మానించారు. కళాశాల ప్రిన్సిపల్ జి బుల్లయ్య అధ్యాపక అధ్యాపకేతర సిబ్బంది, కళాశాల అభివృద్ధి కమిటీ శ్రీనివాసరావుకు అభినందనలు తెలిపారు.

ప్రకృతి వ్యవసాయంపై శిక్షణ

ప్రజాశక్తి-నాదెండ్ల

ప్రకృతి వ్యవసాయ పద్ధతులు పాటించి పంటలను సాగు చేసి పండించినటువంటి ఆహారం తినడం వల్ల ప్రజలు రోగాల బారిన పడకుండా, పర్యావరణం దెబ్బ తిన కుండా భవిష్యత్తు తరాలకు ఆరోగ్యకరమైన ప్రకృతి వనరులను అందించే దిశగా కృషి చేయాలని రీజనల్ కోఆర్డినేటర్ వెంకట్రావు అన్నారు. మండలంలోని చిరుమామిళ్లలో రైతు భరోసా కేంద్రంలో మంగళవారం ప్రకృతి వ్యవసాయ రైతులకు శిక్షణ కార్యక్రమం జరిగింది.

విద్యార్థులకు రక్తపరీక్షలు

ప్రజాశక్తి - యడ్లపాడు

చెంఘిజ్‌ఖాన్‌పేట ఎంపియుపి స్కూల్‌లో విద్యార్థినీవిద్యార్థులందరికీ ఆర్‌బిఎస్‌కె కార్యక్రమంలో భాగంగా పాఠశాలలో మంగళవారం రక్త పరీక్షలు నిర్వహించారు. దీని వలన రక్త హీనత ఉన్న పిల్లలకు ఎలాంటి ఆహారం తీసుకోవాలో, వారికి కావాల్సిన ఐరన్ మాత్రల ఆవశ్యకతను వివరించారు. ఈ కార్ర్యమానికి ఎఎన్ఎం థామాసమ్మ, పాఠశాల హెచ్ఎం శంకర్ పాల్గొన్నారు.

స్వాతంత్ర్య దినోత్సవ స్ఫూర్తిని పొందాలి

ప్రజాశక్తి-పెదకూరపాడు

విద్యార్థినీ విద్యార్థులు ప్రజలందరూ స్వాతంత్ర్య స్ఫూర్తిని పొందాలని పెదకూరపాడు జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు కేవీ రమణ అన్నారు. మంగళవారం పాఠశాలలో క్విట్ ఇండియా దినోత్సవ వేడుకలను నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ స్వతంత్ర స్ఫూర్తితో ప్రతి ఒక్కరూ పనిచేయాలన్నారు.

బస్సు యాత్రను జయప్రదం చేయండి

ప్రజాశక్తి - పల్నాడు జిల్లా

ఈ నెల 27న పల్నాడు జిల్లా నరసరావుపేట పట్టణంలోకి ప్రవేశించనున్న సిపిఐ బస్సు యాత్రను జయప్రదం చేయవలసిందిగా సిపిఐ పల్నాడు జిల్లా కార్యదర్శి మారుతీ వరప్రసాద్ సిపిఐ శ్రేణులకు తెలిపారు. మంగళవారం నరసరావుపేటలోని సిపిఐ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల ప్రజా వ్యతిరేక విధానాలపై జరుగుతున్న సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కామ్రేడ్ కె రామకష్ణ నేతత్వంలో జరుగుతున్న ఈ బస్సు యాత్ర విశాఖపట్నంలో ఆగస్టు 17న ప్రారంభమై సెప్టెంబరు 8న తిరుపతిలో జరిగే బహిరంగ సభ తో ముగుస్తుందన్నారు. రాష్ట్రంలోని అన్ని ప్రాంతాల్లో బస్సు యాత్ర విస్తృతంగా పర్యటిస్తుం దన్నారు. 27 న వినుకొండలో బహిరంగ సభ జరుగుతుందన్నారు.

ఖాళీ స్థలాల్లో పార్కుల అభివృద్ధి

ప్రజాశక్తి - గుంటూరు

నగరపాలక సంస్థ ఓపెన్, రిజర్వ్ స్థలాలను స్థానిక ప్రజలకు ఉపయోగపడేలా అభివృద్ధి చేయనున్నామని, ఎక్కడైనా ఆక్రమణలుంటే తొలగించడానికి పట్టణ ప్రణాళికాధికారులు చర్యలు తీసుకోవాలని నగర కమిషనర్ కీర్తి చేకూరి ఆదేశించారు. గుజ్జనగుండ్ల, బాపయ్య నగర్, ఇన్నర్ రింగ్ రోడ్, రెడ్డిపాలెం, గోరంట్లలోని పలు ప్రాంతాల్లో నగరపాలక సంస్థకు చెందిన రిజర్వ్, ఓపెన్ స్థలాలను కమిషనర్ మంగళవారం పరిశీలించారు. ఖాళీ స్థలాలు అన్యాక్రాంతం కాకుండా పార్కులు, ఆట స్థలాలుగా అభివృద్ధి చేస్తామని, పార్కుల నిర్వహణలో స్థానికులను భాగస్వామ్యం చేస్తామని అన్నారు. పార్కుల్లో ప్రధానంగా వాకింగ్ ట్రాక్, ఓపెన్ జిమ్, పిల్లల ఆట వస్తువులు, పచ్చదనం పెంపు ఉండాలని, గుర్తించిన పార్కుల్లో బాస్కెట్ బాల్, షటిల్ బ్యాడ్మింటన్ కోర్టుల ఏర్పాటుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. నగరపాలక సంస్థకు చెందిన స్థలాల గుర్తింపు, ఆక్రమణల తొలగింపునకు ప్రత్యేక యాక్షన్ ప్లాన్ సిద్ధం చేయాలన్నారు. పర్యటనలో సిటీప్లానర్ ప్రదీప్ కుమార్, ఎస్ఇ భాస్కర్, ఇఇ సుందర్రామిరెడ్డి, డిప్యూటీ సిటీప్లానర్ కోటయ్య, ఎడిహెచ్ రామారావు, ఎఏసిపి అజయ్ కుమార్, డిఇఇ రఫిక్, శివకుమార్, ఎఇలు, టిపిస్‌లు, సచివాలయ ప్లానింగ్, ఎమినిటి కార్యదర్శులు పాల్గొన్నారు.


స్థలాలను పరిశీలిస్తున్న కమిషనర్ కీర్తి చేకూరి



నెహ్రూ నికేతన్‌లో ప్రపంచ అబాకస్ డే

ప్రజాశక్తి-తెనాలి : ప్రపంచ వేగ గణిత దినోత్సవం (వరల్డ్ అబాకస్ డే)ను మంగళవారం స్థానిక బోస్ రోడ్‌లోని నెహ్రూ నికేతన్‌లో నిర్వహించారు. మేనేజింగ్ డైరెక్టర్ మురళీకాంత్ దాసరి పర్యవేక్షణలో విద్యార్థులు వరల్డ్ అబాకస్ డే లెటర్స్ ఆకారంలో మానవహారంగా ఏర్పడ్డారు. మురళి కాంత్ దాసరి మాట్లాడుతూ హైదరాబాదుకు చెందిన విశ్వ ఎడ్యుటెక్ సంస్థ ఆధ్వర్యంలో తమ పాఠశాలలో ఐదేళ్లుగా అబాకస్‌ను నేర్పిస్తున్నట్లు చెప్పారు. భాగాహారాలు, హెచ్చవేతలు, కూడికలు, తీసివేతలు సులభపద్ధలతో, చురుగ్గా చేయడం విద్యార్థులకు నేర్పిస్తున్నామన్నారు.



విద్యార్థులకు వ్యాస రచన పోటీలు

ప్రజాశక్తి - గుంటూరు : నా మట్టి -నా దేశం అనే కార్యక్రమంలో భాగంగా స్థానిక టిజెపిఎస్ కళాశాల జాతీయ సేవా పథకం ఆధ్వర్యంలో 'దేశాభివృద్ధిలో యువత పాత్ర' అంశంపై విద్యార్థులకు వ్యాస రచన పోటీలను మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ ఎబిపి మనోహర్, సెక్రెటరీ కరస్పాండెంట్ కెవి బ్రహ్మం మాట్లాడుతూ స్వాతంత్ర్యోద్యమ వీరుల చేసిన త్యాగాలను గుర్తుపెట్టుకోవాలని, వారి అడుగుజాడల్లో నడిచి దేశాభివృద్ధిలో భాగస్వాములు కావాలని చెప్పారు. స్వరాజ్యం ఊరికే రాలేదని, స్వార్థం లేకుండా, కుల, మత, ప్రాంత, వర్గ, జాతి భేదాలను పక్కనపెట్టి అందరూ కలిసి చేసిన పోరాట ఫలితమని వివరించారు. కార్యక్రమంలో జాతీయ సేవా పథకం కార్యక్రమ నిర్వహణ అధికారులు డాక్టర్ జెవి.సుధీర్ కుమార్, జయశైలజ, శ్రావణి, పి.అప్పారావు పాల్గొన్నారు.

విద్యార్థినులకు రోటరీ క్లబ్ బస్‌పాస్‌లు

ప్రజాశక్తి - మంగళగిరి రూరల్ : చుట్టుపక్కల గ్రామాల నుండి డాన్‌బాస్కో హైస్కూలుకు వచ్చే 260 మంది విద్యార్థినులకు, ఎపిఎస్ ఆర్‌టిసి బస్‌పాస్‌లను రోటరీ క్లబ్ ఆఫ్ మంగళగిరి ఆధ్వర్యంలో మంగళవారం అందించారు. యర్రబాలెం డాన్ బాస్కో హైస్కూలులో జరిగిన పంపిణీకి ముఖ్య అతిథిగా రోటరీ జిల్లా 3150 గవర్నరు బి.శంకర్‌రెడ్డి హాజరవగా మంగళగిరి అధ్యక్షులు ఎ.రేవంత్ మాట్లాడుతూ మరికొన్ని పాఠశాలల విద్యార్థినులకూ బస్‌పాస్‌లు అందిస్తామని, వెయ్యిమందికి వీటిని అందించనున్నామని చెప్పారు. కార్యక్రమంలో హెచ్‌ఎం ఫాతిమరాణి, క్లబ్ కార్యదర్శి జి.శ్రీనివాసరావు, కోశాధికారి ఎన్.వెంకటేశ్వరరావు, ప్రాజెక్టు ఛైర్మన్ డాక్టర్ వంశీకృష్ణ, మాజీ అధ్యక్షులు అనిల్ చక్రవర్తి, డైరెక్టర్లు పాల్గొన్నారు.

నీట మునిగిన పొలాలు, అభివృద్ధి పనుల పరిశీలన

ప్రజాశక్తి-తాడేపల్లి, తాడేపల్లి రూరల్

ఇటీవల వర్షాల కారణంగా చిర్రావూరులో నీట మునిగిన పొలాలను ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి మంగళవారం పరిశీలించారు. నూతక్కి - చిర్రావూరు మధ్య ఉన్న ఆర్ అండ్ బి రోడ్డుకు ఇరువైపుల పొలాల్లోని నీరు బయటకు పోయేందుకు తూములు ఏర్పాటు చేయాలని రైతులు కోరారు. ఎమ్మెల్యే స్పందిస్తూ నీరు పోవడానికి గతంలో సైడు కాల్వలు ఉండేవని, వాటిని రైతులు పూడ్చడం వల్ల ఈ పరిస్థితి వచ్చిందని అన్నారు. పంట పొలాలను అధికారులు తక్షణమే సర్వే చేసి వర్షపు నీరు బయటకు పోయేందుకు చర్యలు చేపట్టాలని, సైడ్ కాల్వలను నిర్మించాలని కోరారు. ఇదిలా ఉండగా కుంచనపల్లి నుండి మంగళగిరి మండలం రేవేంద్రపాడు వరకు గల ఆర్ అండ్ బి రోడ్డు విస్తరణ పనులను ఎమ్మెల్యే పరిశీలించారు. పూర్తిస్థాయిలో నాణ్యత ప్రమాణాలతో, నిరంతరం అధికారుల పర్యవేక్షణలో త్వరితగతిన పనులు పూర్తయ్యేలా చూడాలని అధికారులకు సూచించారు. నులకపేట, డోలాస్‌నగర్ ప్రాంతాల్లో సిమెంటు రోడ్డు నిర్మాణ పనులను పరిశీలించి నెలాఖరుకు పూర్తి చేయాలన్నారు. కొత్తూరులో చాకలి ఐలమ్మ రజక కమ్యూనిటీ హాలు నిర్మాణ పనులను పరిశీలించి దసరా నాటిని పూర్తి చేయాలని ఆదేశించారు. కొన్ని అనివార్య కారణాల వల్ల నిర్మాణ పనుల్లో అలసత్వం చోటుచేసుకుందని చెప్పారు. సీతానగరం, మహానాడు ప్రాంతాల్లో సిసి రోడ్లు, డ్రెయిన్ల పనులనూ పరిశీలించారు. ఇంకా అవసరమైన చోట నిర్మాణ పనులకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారులను కోరారు. పరిశీలనలో వైసిపి నాయకులు ఎం.సాంబశివరావు, బి.వేణుగోపాలసోమిరెడ్డి, డిఇ కృష్ణారెడ్డి, ఎఇ ప్రవీణ్‌కుమార్, జెసిఎస్ కన్వీనర్ డేవిడ్‌రాజు పాల్గొన్నారు.


నీట మునిగిన పొలాలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే

ఆటపాటలు, పౌష్టికాహారమే ఆరోగ్యం

ప్రజాశక్తి - గుంటూరు

ఆరోగ్య భారత నిర్మాణంలో పిల్లల ఎదుగుదలకు పౌష్టికాహారం, ఆటలు కీలకమని, ఇవే పిల్లల్లో రోగనిరోధక శక్తిని పెంచుతూ వారిని చదువు పట్ల ఆసక్తి కలిగేలా చేస్తాయని జిల్లా వైద్యారోగ్య శాఖాధికారి డాక్టర్ ఎ.శ్రావణ్ కుమార్ అన్నారు. వర్షాకాలంలో వచ్చే సీజనల్ వ్యాధులు, నులిపురుగుల నివారణలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై నగరంపాలెం ప్రజ్ఞ టెక్నో, మెడి పాఠశాలలో మంగళవారం అవగాహన కల్పించారు. డాక్టర్ శ్రావణ్‌కుమార్ మాట్లాడుతూ కలుషిత నీరు, జంక్ ఫుడ్స్ వంటి చెడు ఆహారపు అలవాట్లు ద్వారా పొట్టలో నులిపురుగులు ఏర్పడి రక్తహీనత కలుగుతుందన్నారు. దగ్గరలో ఉన్న ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించి వైద్యుల సలహా మేరకు మందులు వేసుకోవాలని సూచించారు. కాచి చల్లార్చిన నీటినే తాగాలని, ఇంటిలో వండిన ఆహారం మాత్రమే పూర్తి ఆరోగ్యాన్ని ఇస్తున్నదన్న విషయాన్ని అందరూ గ్రహించాలని చెప్పారు. విద్యార్థులకు నిర్వహించిన వ్యాసరచన, వక్తృత్వ పోటీల్లో విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. పాఠశాల కరస్పాండెంట్ నాయుడు చక్రనాగ్ మాట్లాడుతూ కార్పొరేట్ స్థాయి విద్యా బోధన, పిల్లల ఆరోగ్యం, వారి సమగ్ర ఎదుగుదలకు ప్రజ్ఞ విద్యాసంస్థ ప్రత్యేక శ్రద్ధ కనబరుస్తున్నదని అన్నారు. కార్యక్రమంలో డాక్టర్ కీర్తి, శిరీష, పాఠశాల కరస్పాండెంట్ ప్రిన్సిపాల్ నాయుడు కోటేశ్వరరావు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డిఎంహెచ్ఒ డాక్టర్ శ్రావణ్‌కుమార్

రైతులకు రూ.100 కోట్ల రుణాలు అందించడమే లక్ష్యం

నెక్కల్లు సొసైటీ ఛైర్మన్ మున్నంగి కోటిరెడ్డి

ప్రజాశక్తి - తుళ్లూరు

రైతులకు రూ.100 కోట్ల మేర రుణాలు అందించడమే లక్ష్యంగా పనిచేస్తామని నెక్కల్లు ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం నూతన అధ్యక్షులు మున్నంగి కోటిరెడ్డి చెప్పారు. పెదపరిమికి చెందిన కోటిరెడ్డి నెక్కల్లు సొసైటీ అధ్యక్షులుగా మంగళవారం ప్రమాణ స్వీకారం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ 11 గ్రామాల పరిధిలో రైతులకు సేవలందించేందుకు, సొసైటీని బలోపేతం చేసేందుకు కృషి చేస్తానని చెప్పారు. వైసిపి నియోజకవర్గ సమన్వయకర్త కత్తెర సురేష్‌కుమార్ మాట్లాడుతూ బాధ్యతాయుతంగా పనిచేసి అందరి మన్ననలు పొందాలని, సొసైటీ ద్వారా రైతులకు ప్రయోజనం చేకూర్చాలని అన్నారు. కార్యక్రమంలో తుళ్లూరు సొసైటీ అధ్యక్షులు నాయుడు నాగేశ్వరరావు, కొప్పుల శేషగిరిరావు, ఎన్.రఘునాథరావు, ఎన్.బాబురావు, ఎ.లక్ష్మీనారాయణరెడ్డి, బి.కిశోర్, డి.పోతురాజు, ఎన్.రామారావు పాల్గొన్నారు.


ప్రమాణ స్వీకారం చేసిన మున్నంగి కోటిరెడ్డి

విజ్ఞాన్స్ యూనివర్సిటీ విద్యార్థినికి పిహెచ్‌డి

ప్రజాశక్తి - గుంటూరు



వడ్లమూడిలోని విజ్ఞాన్స్ యూనివర్సిటీలోని స్కూల్ ఆఫ్ కన్వెన్షనల్ ఇంజినీరింగ్ విభాగంలోని డిపార్ట్‌మెంట్ ఆఫ్ సివిల్ ఇంజినీరింగ్ విభాగానికి చెందిన ముక్కాల ప్రియాంక అనే విద్యార్థినికి తమ యూనివర్సిటీ పిహెచ్‌డి పట్టా అందించినట్లు వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ పి.నాగభూషణ్ మంగళవారం తెలిపారు. 'ఎక్సిపెరిమెంటల్ ఇన్విస్టిగేషన్ ఆన్ స్ట్రెంగ్త్, డూరబిలిటీ అండ్ మైక్రోస్ట్రక్చరల్ క్యారెక్టరిస్టిక్స్ ఆఫ్ జియోపాలిమర్ అగ్రిగేట్ బేస్డ్ కాంక్రీట్' అంశంపై పరిశోధనకు గాను పిహెచ్‌డిని ప్రదానం చేశామన్నారు. ఈమెకు విజ్ఞాన్స్ యూనివర్సిటీలో సివిల్ ఇంజినీరింగ్ విభాగాధిపతి డాక్టర్ కార్తికేయన్ మునిరాజు గైడ్‌గా వ్యవహరించారన్నారు. డాక్టరేట్ పొందిన ప్రియాంకను ఆయా విభాగాల డీన్లు, అధిపతులు, అధ్యాపక సిబ్బంది అభినందించారు.


డీఎస్పీకి జామ మొక్కలను అందిస్తున్న డాక్టర్ శారద

శారద సేవా సమితి మొక్కలు పంపిణీ

ప్రజాశక్తి - తెనాలి

పట్టణానికి చెందిన శారద సేవాసమితి ఆధ్వర్యంలో మంగళవారం తైవాన్ జామ, ఉసిరి మొక్కలను పంపిణీ చేశారు. పట్టణంలోని అన్ని పోలీస్ స్టేషన్‌లకు సంబంధించి డీఎస్పీ కార్యాలయం వద్ద నిర్వహించిన కార్యక్రమంలో డీఎస్పీ బి.జనార్ధన్‌రావుకు 100 జామ, 20 ఉసిరి మొక్కలను అందించారు. లక్ష జామ మొక్కల పంపిణీ లక్ష్యంగా కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఆమె చెప్పారు. డీఎస్పీ మాట్లాడుతూ కోవిడ్ సమయంలో సామాజిక దక్పథంతో డాక్టర్ శారద పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారని, అదే స్ఫూర్తితో పర్యావరణ పరిరక్షణకు మొక్కల పంపిణీ ప్రశంసనీయమని అన్నారు. కార్యక్రమంలో సొసైటీ వాలంటీర్లు జ్యోతి, నాగరాజుకుమారి, కన్వీనర్ ఎన్.శ్రీనివాసరావు, డీఎస్పీ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.



ఓటు కోసం దరఖాస్తు చేసుకోండి

ప్రజాశక్తి - మంగళగిరి

ఓటు హక్కు కోసం 18 ఏళ్లు నిండిన అందరూ దరఖాస్తు చేసుకోవాలని అసిస్టెంట్ ఎలక్ట్రోరల్ రిజిస్ట్రేషన్ అధికారి (ఎఇఆర్ఒ) కె.హేమమాలిని సూచించారు. ఇఆర్ఒ లలిత కుమారితో కలిసి స్థానిక కొత్తపేటలో ఇంటింటి సర్వేను పరిశీలించారు. ఓటు కార్డులో తప్పుల సవరణకు, కొత్తగా ఓటు నమోదుకు దరఖాస్తులు అందజేయాలన్నారు.

మోదుకూరి జాన్సన్‌కు నివాళి

ప్రజాశక్తి - గుంటూరు



'అగ్నికవి' మోదుకూరి జాన్సన్ 87వ జయంతిని ఓల్డ్ క్లబ్ రోడ్డులో మేడ్ రాష్ట్ర కార్యాలయంలో మంగళవారం నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలేసి నివాళు లర్పించారు. మేడ్ రాష్ట్ర అధ్యక్షులు ఎం.దేవపాల్ మాట్లాడారు. కె.ఆనందరావు, ఆర్.నల్లయ్య, కె.మరియదాసు, కె.శ్యామ్, పి.రమేష్ పాల్గొన్నారు.

25న తేళ్ల నారాయణ విజ్ఞాన కేంద్రం ప్రారంభోత్సవం

హాజరుకానున్న సిపిఎం పొలిట్‌బ్యూరో సభ్యులు బివి రాఘవులు



సమావేశంలో మాట్లాడుతున్న పాశం రామారావు

ప్రజాశక్తి - పెదనందిపాడు రూరల్

మండల కేంద్రమైన పెదనందిపాడులో నిర్మిస్తున్న తేళ్ల నారాయణ విజ్ఞాన కేంద్రాన్ని ఈనెల 25న ఉదయం 10 గంటలకు ప్రారంభించనున్నట్లు సిపిఎం గుంటూరు జిల్లా కార్యదర్శి పాశం రామారావు ప్రకటించారు. ప్రారంభోత్సవానికి సిపిఎం పొలిట్‌బ్యూరో సభ్యులు బివి రాఘవులు ముఖ్యఅతిథిగా హాజరవుతారని తెలిపారు. నిర్మాణంలో ఉన్న విజ్ఞాన కేంద్రం వద్ద వివిధ ప్రజా సంఘాల విస్తృత సమావేశం కె.హరిబాబు అధ్యక్షతన మంగళవారం నిర్వహించారు. రామారావు మాట్లాడుతూ కేంద్రంలో బిజెపి అధికారంలోకి వచ్చాక నిత్యావసర వస్తువులు, పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరలు విపరీతంగా పెరిగాయని చెప్పారు. వీటిపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత ఉందని, దీన్ని పక్కదారి పట్టించడానికి బిజెపి మతచిచ్చు పెడుతోందని, ఏకరూప పౌరస్మృతి ఇందులో ఒక భాగమన్నారు. మణిపూర్‌లో మూణ్ణెల్లుగా అల్లర్లు జరుగుతున్నా ఆ రాష్ట్రాన్ని ప్రధాని మోడీ సందర్శించకపోవడం దుర్మార్గమన్నారుః. మణిపూర్ ఘటనల్లో నిందితులను తక్షణమే అరెస్టు చేయాలని కోరారు. జిల్లా నాయకులు కె.నాగేశ్వరరావు మాట్లాడుతూ విభజన చట్టం హామీల అమలును విస్మరించి రాష్ట్రానికి కేంద్రం తీవ్ర అన్యాయం చేసిందన్నారు. అయినా రాష్ట్రంలోని వైసిపి, టిడిపిలు బిజెపికి మద్దతుగా నిలవడం అన్యాయమన్నారు. సిపిఎం మండల కార్యదర్శి డి.రమేష్‌బాబు మాట్లాడుతూ గుంటూరు ఛానల్‌ను పర్చూరు వరకూ పొడిగించడానికి సత్వరమే పనులు చేపట్టాలని, అందుకుగాను నిధులు కేటాయించాలని కోరారు. లేకుంటే ఆందోళనకు పూనుకుంటామని చెప్పారు. సమావేశంలో కె.శివనాగేశ్వరరావు, జి.రమేష్, పి.భువనేశ్వరి, కె.బాబు, డి.శ్రీను, ఎన్.ఆచార్యులు, ఎం.వెంకటేశ్వర్లు, జె.రామారావు, కె.శ్రీను, ఎం.రమణ, సిహెచ్.యానాదులు, ఎల్.నాగేశ్వరరావు పాల్గొన్నారు.

పోపూరి రామారావు వర్ధంతి సందర్భంగా 11న స్మారక ఉపన్యాసం

ప్రజాశక్తి - యడ్లపాడు : సిపిఎం నాయకులు పోపూరి రామారావు 4వ వర్ధంతి సందర్భంగా 11వ తేదీ అయిన శుక్రవారం ఉదయం 10 గంటలకు మండల కేంద్రమైన యడ్లపాడులోని పోపూరి రామారావు విజ్ఞాన కేంద్రంలో స్మారక ఉపన్యాసం ఉంటుందని సిపిఎం మండల కార్యదర్శి టి.కోటేశ్వరరావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. 'దేశ సంపద దోపిడి - ప్రజలపై భారాలు - కార్పొరేట్లకు అనుకూలంగా ప్రభుత్వ వాదానాలు' అంశంపై సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కె.ప్రఎవకరరెడ్డి మాట్లాడతారని తెలిపారు.

11న మెగా జాబ్‌మేళా

ప్రజాశక్తి-తెనాలి

నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పనే లక్ష్యంగా మెగా జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ చెప్పారు. ఈ మేరకు జాబ్ మేళా పోస్టర్‌ను ఆయన మంగళవారం ఆవిష్కరించారు. ఈ నెల 11న ఉదయం 9 గంటలకు డిపార్ట్మెంట్ ఆఫ్ స్కిల్ డెవలప్మెంట్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న జాబ్ మేళాలో టిసిఎస్, ఇన్ఫోసిస్, అసెంచూర్, వర్చ్యూస వంటి సాఫ్ట్వేర్ కంపెనీలతో పాటు పలు బహుళజాతి కంపెనీలలో ఉద్యోగావకాశాలు కల్పించేందుకు ఆయా సంస్థల ప్రతినిధులు పాల్గొంటారని చెప్పారు. టెన్త్, ఇంటర్, డిగ్రీ, బిటెక్, ఫార్మసీ, డిప్లమో వంటి అర్హతలు గల యువత పాల్గొనవచ్చన్నారు. వివరాలకు స్కిల్ హబ్ కో-ఆర్డినేటర్ డి.రాజా, 7893789361, ఇఎస్సీ కో-ఆర్డినేటర్ బి.రవికుమార్ 6304292828ను సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ డాక్టర్ కె.రామ్‌చంద్, మున్సిపల్ వైస్ చైర్మన్ ఎ.నాగవేణి, కౌన్సిలర్ ఎ.పద్మ, ఎ.కిరణ్ కుమార్, కె.నాగేశ్వరరావు పాల్గొన్నారు.